




సమాజ హితం - మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778








రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 206 పేజీలు : 12, వెల రూ. 5/- శుక్రవారం, సెప్టెంబరు 18, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA





## హైదరాబాద్ విమోచనం..

# ఐక్యతకు పునాది

**ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్**

**రాజనీతిజ్ఞత, త్యాగాల గాథగా హైదరాబాద్ చరిత్ర**

**విద్యార్థులు, మేధావులు, రైతులు పోరాటంలో భాగస్వాములే**

**సంస్థానాల ఏకీకరణతో బలమైన భారతానికి పటేల్ పునాది**

**విమోచన దినోత్సవం కాదు.. సంకల్ప దినోత్సవంగా ముందుకు**

**నాటి పోరాటాలు, త్యాగాల స్ఫూర్తితో వికసిత్ భారత్**

హైదరాబాద్: విభిన్న రాజకీయ పరిస్థితులు, ఎన్నో సంఘర్షణల మధ్య ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో స్వాతంత్ర్యం తర్వాత భారతదేశం ఎదుర్కొన్న అసంఖ్యాక సవాళ్లను హైదరాబాద్ చరిత్ర ప్రతిబింబిస్తుందని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. హైదరాబాద్ విమోచన పరిణామాలను రాజనీతిజ్ఞత, ధైర్యం, త్యాగాల గాథగా అభివర్ణించారు. ప్రతి పౌరుడికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించే రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణం నిరంతర ప్రక్రియగా కొనసాగిందని చెప్పారు. హైదరాబాద్ విమోచన నేపథ్యంలో సాగిన ప్రజా ఉద్యమంలో విద్యార్థులు, మేధావులు, రచయితలు, సామాజిక, రాజకీయ కార్యకర్తలు, రైతులు, సామాన్య పౌరులు భాగస్వాములయ్యారని గుర్తుచేశారు. ఈ పోరాటంలో పలువురు కారాగారవాసం,

(మిగతా 2వ పేజీలో)

# పోరాట స్ఫూర్తితో తెలంగాణ ముందుకు

**ప్రజాపాలనతో కొత్త దిశ చూపిస్తున్నాం: సీఎం రేవంత్**

**రైతులు, మహిళలు, పేదల సంక్షేమమే మా తొలి ప్రాధాన్యం**

**యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించడమే లక్ష్యం**

**4 కోట్ల ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం**

**త్యాగాల స్ఫూర్తిని కొనసాగిస్తూ స్వర్ణ తెలంగాణ సాధిస్తాం**

హైదరాబాద్: తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక రాష్ట్రాన్ని నిర్మించుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమంతోపాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం ప్రజా పాలనకు పునాదులని చెప్పారు. సెప్టెంబర్ 17 గతాన్ని గుర్తు చేసుకునే రోజే కాకుండా భవిష్యత్తు బాధ్యతలను గుర్తుచేసే రోజని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలు, ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలన్నారు. రైతుకు భరోసా, మహిళలకు ఆర్థిక స్వావలంబన, అట్టడుగు వర్గాలకు న్యాయం, పేద పిల్లలకు నాణ్యమైన విద్య, వైద్యం, యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని ప్రపంచం గర్వించేలా తీర్చిదిద్దుకుందామని అన్నారు. నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో సీఎం జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు నివాళులర్పించారు. తరతరాలుగా కొనసాగిన అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలను ఎదిరించిన చరిత్ర తెలంగాణకు ఉందన్నారు. సమ్మక్క--సారలమ్మల పోరాటం నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం,

(మిగతా 2వ పేజీలో)



## నిజామాబాద్‌లో యూట్యూబర్ వైష్ణవి భర్త హత్య



**కొబ్బరి బొండాల కత్తితో దాడి చేసి చంపిన వ్యక్తి**

**భార్య వైష్ణవి హత్య కేసులో హరిబాబు గతంలో నిందితుడు**

**పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని పోలీసుల అనుమానం**

**ఈ దాడిలో ముగ్గురు పాల్గొన్నట్లు ప్రాథమికంగా గుర్తింపు**



## హైదరాబాద్‌లో సెప్టెంబరు 25న

# గణేశ్ నిమజ్జనం

**గణేశ్ నిమజ్జనం హైదరాబాద్‌లో పోలీసుల కవాతు.. రంగంలోకి ఆర్‌ఏఎఫ్**

**నగరంలో పోలీసులు, ఆర్‌ఏఎఫ్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్**

**గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో పటిష్ఠ భద్రతా చర్యలు**

**గోషామహల్, బేగంబజార్ పరిధిలోని సున్నిత ప్రాంతాల్లో కవాతు**

**నిమజ్జనం రోజు 20,000 మంది పోలీసులతో భారీ బందోబస్తు**

**నిబంధనలు పాటించాలని ఉత్సవ కమిటీలకు పోలీసుల సూచన**

## 'మా ఆస్తులపై విచారణకు సిద్ధం.. మీరూ సిద్ధమా?'



**కేసీఆర్‌కు ఉన్నది 67 ఎకరాలే.. వెయ్యి ఎకరాలు కాదు: కేటీఆర్**

**అసెంబ్లీలో సీఎం చెప్పిన మాటలనే గుర్తుచేసిన బీఆర్ఎస్ నేత**

**పుట్టినప్పటి నుంచి మా ఆస్తులపై విచారణ జరిపించండి**

**మీ ఆస్తులపైనా దర్యాప్తునకు సిద్ధమా అంటూ రేవంత్‌రెడ్డికి సూటి సవాల్**

**లిలినిరాధార ఆరోపణలకు సీఎం క్షమాపణ చెప్పాలి**

**కేసీఆర్ రైతు.. భూమిని వ్యాపార వస్తువుగా చూడరు: కేటీఆర్**

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు

సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా

సర్వే నంబర్లు, పాత రికార్డుల సేకరణ

అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటనతో కదలిక





## షెహజాద్ భట్టి చుట్టూ బిగుస్తున్న భారత్ ఉచ్చు..

**అతడిని పాకిస్థాన్ తరలించేందుకు ఐఎస్ఐ ప్లాన్!**

**షెహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించిన కేంద్ర హోం శాఖ**

**భట్టిని పాకిస్థాన్‌కు తరలించి కాపాడే యత్నంలో ఐఎస్ఐ ఉన్నట్లు అంచనా**

**భట్టిపై రెడ్ కార్నర్ నోటీసు జారీకి సిద్ధమవుతున్న భారత దర్యాప్తు సంస్థలు**

**భారతీయ యువతను ఉగ్రవాదం వైపు మళ్లిస్తూ విధ్వంసానికి కుట్ర**

**భట్టిని ఐఎస్ఐ రిక్రూట్ చేసుకుని నడిపిస్తున్నట్లు వెల్లడించిన నిఘా వర్గాలు**

## విజయవంతమైన 'వన్‌వే' విధానం..

# కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు రద్దు!



**'వన్ వే' తో చిక్కుల్లేకుండా సాగుతున్న ట్రాఫిక్**

**ఈ విధానం విజయవంతం కావడంతో మారిన ప్రభుత్వ ఆలోచన**

**పంజాగుట్ట నుంచి చెక్‌పోస్ట్ వరకు 6 వరుసల ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదన**

**కొత్త ప్లాన్‌తో ప్రభుత్వానికి రూ.1000 కోట్లకు పైగా ఆదా**

**భూసేకరణ, నిర్మాణ వ్యయం తగ్గించడమే లక్ష్యం**

# పోరాట స్ఫూర్తితో తెలంగాణ ముందుకు

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు అన్యాయాన్ని ప్రశ్నించిన స్ఫూర్తి ఈ నేల సొంతమని చెప్పారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలోనే కొనసాగిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. నిజాం పాలనలో హైదరాబాద్ పారిశ్రామిక, వ్యవసాయ, విద్య, వైద్య రంగాల్లో పురోగతి సాధించినప్పటికీ గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, అణచివేత తీవ్రంగా ఉండేదన్నారు. చివరి దశలో రజాకార్ల దౌర్జన్యాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయని చెప్పారు. హైదరాబాద్ ప్రజల ఆకాంక్షలు, ఉద్యమాలు, పోరాటాల నేపథ్యంలో 1948లో ఆపరేషన్ పోలో సైనిక చర్య చేపట్టడంతో నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయారని, సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం భారతదేశంలో అంతర్భాగమైందని వివరించారు. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భంగానే సెప్టెంబర్ 17ను ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సీఎం చెప్పారు. రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసి రూ.20,616 కోట్లు విడుదల చేయడంతో 25.35 లక్షల రైతు కుటుంబాలకు ప్రయోజనం కల్పించామని తెలిపారు. 32 నెలల్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1.72 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. భూ పరిపాలనలో సంస్కరణలు తీసుకొచ్చామని, భూ భారతి, భూధార్, కృత్రిమ మేధ ఆధారిత భూమిత్ర సేవలను ప్రారంభించామని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. మహిళా మార్ట్‌లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సుల ద్వారా వారికి ఆదాయ మార్గాలు కల్పిస్తున్నామన్నారు. మహిళలను కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములుగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. తొలి దశలో రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు కేటాయించామని చెప్పారు. రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్ల పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కుల, మత భేదాలకు అతీతంగా పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం, పాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మధ్యాహ్న భోజనాన్ని 12వ తరగతి వరకు విస్తరించామని చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలోనూ భారీగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని సీఎం తెలిపారు. అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని, వరంగల్‌లో 2,000 పడకలతో టిమ్స్ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు రూ.38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఆదిలాబాద్,



మామునూరు విమానాశ్రయాలకు అనుమతులు సాధించామని చెప్పారు.

హైదరాబాద్ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించేందుకు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపట్టామని రేవంత్‌రెడ్డి తెలిపారు. 55 కిలోమీటర్ల పరిధిలో మూసీని పునరుజ్జీవింపజేస్తామని చెప్పారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన ఆహార కల్తీని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఇందుకోసం టీజీ సేఫ్ వ్యవస్థను ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధికి ఫ్యూచర్ సిటీ కీలకంగా మారనుందని సీఎం చెప్పారు. డిసెంబర్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 సందర్భంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తామని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో భారీ పెట్టుబడులు వస్తున్నాయని, ఏఐ డేటా సెంటర్లు, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, క్రీడలు, ఆరోగ్యం, విద్య తదితర రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ప్రాంతీయ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ రహదారులు, డ్రైపోర్టులు, హైదరాబాద్--నాగ్‌పూర్, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--విజయవాడ పారిశ్రామిక కారిడార్లు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని సీఎం పేర్కొన్నారు. రహదారుల అభివృద్ధికి ఆర్‌అండ్‌బీ పరిధిలో రూ.13 వేల కోట్లు, పంచాయతీరాజ్ పరిధిలో రూ.6,294 కోట్లతో పనులు చేపడుతున్నామని తెలిపారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం చెప్పారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి కేవలం నగరాలకు పరిమితం కాకుండా రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి చేరాలని, ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పు కనిపించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. చరిత్రను మరిచిపోకుండా, చరిత్ర దగ్గరే ఆగిపోకుండా తెలంగాణ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# హైదరాబాద్ విమోచనం.. ఐక్యతకు పునాది

హింస, వ్యక్తిగత కష్టనష్టాలను ఎదుర్కొన్నారని తెలిపారు. రామ్‌జీ గోండ్, తుర్రేబాజ్ ఖాన్, కొమురం భీమ్ వంటి దేశభక్తులకు నివాళులర్పించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 79వ హైదరాబాద్ విమోచన దినోత్సవంలో రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్వతంత్ర భారత చరిత్రలో ఓ కీలక ఘట్టానికి హైదరాబాద్ సంస్థాన విమోచనం ముగింపు పలికిందన్నారు. జాతీయ సమగ్రత, సార్వజనీనతకు బాటలు వేయాల్సిన అవసరాన్ని ఈ ఘట్టం గుర్తుచేస్తోందని చెప్పారు. సంస్థానాల ఏకీకరణ ద్వారా బలమైన, ఏకీకృత భారతదేశానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ పునాది వేశారని పేర్కొన్నారు. దేశ ఐక్యతకు అందరూ ఒకే భాష, సంప్రదాయం, విశ్వాసం కలిగి ఉండాల్సిన అవసరం లేదన్నారు. భిన్న రాజకీయ అభిప్రాయాలు ఉన్నప్పటికీ రాజ్యాంగం, సార్వభౌమాధికారం ప్రజలకే చెందుతాయన్న భావన అందరినీ ఏకతాటిపై నిలుపుతుందని వివరించారు. విమోచన దినోత్సవం కేవలం చారిత్రక తేదీని గుర్తుచేసుకునే కార్యక్రమం కాదని, దేశ సమైక్యతను, భారత ప్రగతి ప్రస్థానాన్ని ముందుకు తీసుకెళ్లే విలువలను గుర్తుచేసే సందర్భమని అన్నారు. 1947--48 మధ్యకాలంలో దేశ నిర్మాణంలో కేంద్ర బలగాలు కీలక పాత్ర పోషించాయని రాధాకృష్ణన్ చెప్పారు. నక్సల్ రహిత భారత్, అన్ని రాష్ట్రాల్లో శాంతిభద్రతలు నెలకొనాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని పేర్కొన్నారు. నక్సలిజం నిర్మూలనలో కేంద్ర బలగాలు కీలకంగా పనిచేశాయని అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసే దిశగా చర్యలు కొనసాగాయని చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం తగ్గడంతో అభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ కీలక పాత్ర పోషించారని, సంస్థానాల ఏకీకరణలో పటేల్ ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. నేడు 'వికసిత్ భారత్--2047' దిశగా ప్రధాని మోదీ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ హైదరాబాద్ విమోచన దినోత్సవం కేవలం స్వాతంత్ర్య దినోత్సవం కాదని, సంకల్ప దినోత్సవమని అన్నారు. ఇది జాతీయ ఏకతా దినంగా స్ఫూర్తినిస్తుందని చెప్పారు. విమోచన దినోత్సవం నుంచి ప్రేరణ పొంది సంకల్పబద్ధంగా ముందుకు సాగితే దేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే లక్ష్యం మరింత బలపడుతుందని అన్నారు. సర్దార్ పటేల్ చేపట్టిన 'ఆపరేషన్ పోలో' అన్యాయంపై న్యాయం సాధించిన విజయమని పేర్కొన్నారు. తన స్వస్థలమైన జోధ్‌పూర్‌కు చెందిన సైనికులు, పూర్వీకులు, కుటుంబ సభ్యులు కూడా ఆ సమయంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. అందుకే హైదరాబాద్, జోధ్‌పూర్‌ల మధ్య విడదీయరాని బంధం ఉందన్నారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లా మాట్లాడుతూ జాతీయ చరిత్రలో హైదరాబాద్ విమోచన అత్యంత విశిష్టమైన, చారిత్రక



దినమని అన్నారు. నాటి పోరాటాలు, పూర్వీకులు ఎదుర్కొన్న కష్టాలు, బలిదానాలను నేటి యువత అర్థం చేసుకోవాలని సూచించారు. వీరుల పోరాటం, త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని వికసిత్ తెలంగాణ, తద్వారా వికసిత్ భారత్ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ నిజాం మంచి పాలన అందించారని కొందరు చెబుతున్నారని, పాలన అంత గొప్పగా ఉంటే వందేమాతరం రామచంద్రరావు, భాగ్యరెడ్డి వర్మ, కొమురం భీమ్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య వంటి వారు నిజాం అణచివేతకు వ్యతిరేకంగా ఎందుకు పోరాడాల్సి వచ్చిందని ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా నిజాంను కీర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ సమాజానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన కొందరు నేతలు నిజాంను గొప్పవాడిగా పేర్కొనే పరిస్థితి రావడం సిగ్గుచేటన్నారు. రజాకార్ల అఘాయిత్యాలను కప్పిపుచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తొలుత ఉప రాష్ట్రపతి పోలీస్ అమరవీరుల స్మృతి స్థూపం వద్ద నివాళులర్పించి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం కేంద్ర బలగాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కేంద్ర బలగాలకు చెందిన పది బృందాలు డప్పు, డోలు, కోలాటం, గుస్సాడి, శివసత్తులు, లంబాడీ, బతుకమ్మ, పేరిణి శివతాండవం తదితర కళా, నృత్యరూపాలను ప్రదర్శించాయి. ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయంలో పలువురు నేతలు, అధికారులు ఉప రాష్ట్రపతికి స్వాగతం పలికారు.

## విజయవంతమైన 'వన్‌వే' విధానం..

## కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు రద్దు!



కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రతిపాదించిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ ప్రణాళిక మారింది. ఇటీవల ప్రవేశపెట్టిన 'వన్‌వే' విధానం ట్రాఫిక్ సమస్యను చాలావరకు పరిష్కరించడంతో, రూ.1090 కోట్ల విలువైన బహుళ ప్రాజెక్టులను రద్దు చేయాలని అధికారులు భావిస్తున్నారు. వాటి స్థానంలో పంజాగుట్ట నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఒకే భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని ప్రతిపాదించారు. గతంలో కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న ఏడు జంక్షన్ల వద్ద సిగ్నళ్ల కారణంగా వాహనదారులు నిమిషాల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. అయితే, నిర్మాణ పనుల కోసం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన వన్‌వే విధానం ఊహించని ఫలితాలనిచ్చింది. ప్రస్తుతం వాహనాలు ఎక్కడా ఆగకుండా సాఫీగా ప్రయాణిస్తున్నాయి. దీంతో, వేల కోట్లు ఖర్చు చేసి బహుళ ప్రాజెక్టులు చేపట్టడం అనవసరమని అధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు. కొత్త ప్రణాళిక ప్రకారం, పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు సుమారు 4 కిలోమీటర్ల పొడవునా ఆరు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. దీనివల్ల ఐటీ కారిడార్ నుంచి పంజాగుట్ట, ఖైరతాబాద్, సికింద్రాబాద్ వైపు వెళ్లే వాహనదారులు సిగ్నల్ చిక్కులు లేకుండా నేరుగా ప్రయాణించవచ్చు. ఈ కొత్త ప్రతిపాదనతో ప్రభుత్వానికి భూసేకరణ, నిర్మాణ వ్యయం రూపంలో రూ.1000 కోట్లకు పైగా ఆదా కానుంది. పాత ప్లాన్ ప్రకారం 237 ఆస్తులను సేకరించాల్సి ఉండగా, కొత్త కారిడార్‌తో ఆ భారం గణనీయంగా తగ్గనుంది. ప్రస్తుతం విజయవంతంగా నడుస్తున్న కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే విధానం యథాతథంగా కొనసాగుతుంది. ఇప్పటికే పనులు మొదలుపెట్టిన చోట్ల వాటిని నిలిపివేసి, రోడ్లను పునరుద్ధరించనున్నారు. ఈ నూతన ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదనపై ప్రభుత్వం నుంచి తుది ఆమోదం లభించాల్సి ఉంది.



## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి..

## రంగంలోకి రెవెన్యూ అధికారులు

**కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు**

**సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా**

**సర్వే నంబర్లు, పాత రికార్డుల సేకరణ**

**అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటనతో కదలిక**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఫామ్‌హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంపై దృష్టి పెట్టారు. కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

## హైదరాబాద్‌లో సెప్టెంబరు 25న గణేశ్ నిమజ్జనం

హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాలు, సెప్టెంబర్ 25న జరగనున్న విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో నగర పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి గురువారం నగరంలోని పలు సున్నితమైన ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శాంతిభద్రతలను కాపాడటం, మత సామరస్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కవాతు చేపట్టారు.గోల్కొండ జోన్ డీసీపీ జె. రాఘవేందర్ రెడ్డి నేతృత్వంలో ఈ ఫ్లాగ్ మార్చ్ జరిగింది. గోషామహల్, బేగంబజార్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ కవాతు నిర్వహించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి మొదలైన ఈ ఫ్లాగ్ మార్చ్.. పటేల్ నగర్, దారుస్సలాం, ఘోడే కీ ఖబర్, జుమ్మేరాత్ బజార్ టీ-జంక్షన్ మీదుగా సాగింది. స్థానిక పోలీసులతో పాటు ఆర్‌ఏఎఫ్ సిబ్బంది ఇందులో పాల్గొన్నారు.పండుగ సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూసేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని ఈ ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలకు భరోసా కల్పించారు. గణేశ్ మండపాల నిర్వాహకులు, ఊరేగింపులో పాల్గొనేవారు పోలీసుల నిబంధనలు, సూచనలను కచ్చితంగా పాటించాలని గోషామహల్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రవణ్ కుమార్ తెలిపారు. పోలీసులు సూచించిన మార్గాల్లో, నిర్దేశిత సమయంలోనే ఊరేగింపులు జరపాలని, ట్రాఫిక్‌కు లేదా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగించవద్దని స్పష్టం చేశారు.గణేశ్ నిమజ్జనం రోజున హైదరాబాద్ వ్యాప్తంగా సుమారు 20,000 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు కోసం మోహరించనున్నారు. ఇటీవల పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, జీహెచ్ఎంసీ, ఇతర శాఖల అధికారులతో కలిసి బాలాపూర్ నుంచి ట్యాంక్ బండ్ వరకు 19 కిలోమీటర్ల నిమజ్జన మార్గాన్ని తనిఖీ చేశారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## షెహజాద్ భట్టి చుట్టూ బిగుస్తున్న భారత్ ఉచ్చు..

భారత్‌లో నిఘా, స్మగ్లింగ్, ఉగ్రదాడులకు పాల్పడేందుకు యువతను రిక్రూట్ చేసుకుంటున్న షెహజాద్ భట్టి నెట్‌వర్క్‌పై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ నెట్‌వర్క్‌ను చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (UAPA) కింద ఉగ్రవాద సంస్థగా ప్రకటించి, నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో భారత దర్యాప్తు సంస్థలు విచారణను ముమ్మరం చేయడంతో, పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ (ISI) తమ ఏజెంట్ అయిన భట్టిని కాపాడేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు నిఘా వర్గాలు భావిస్తున్నాయి.ప్రస్తుతం దుబాయ్, బ్రెజిల్ కేంద్రంగా కార్యకలాపాలు నడుపుతున్న భట్టిని తిరిగి పాకిస్థాన్‌కు తరలించే అవకాశం ఉందని భారత ఇంటెలిజెన్స్ అధికారులు అంచనా వేస్తున్నారు. యూఏఈ, బ్రెజిల్ దేశాలతో భారత్‌కు నేరస్థుల అప్పగింత ఒప్పందాలు ఉండటమే ఇందుకు కారణం. భట్టి నెట్‌వర్క్‌పై విచారణను వేగంగా పూర్తిచేసి, ఛార్జిషీట్ దాఖలు చేయాలని భారత ఏజెన్సీలు భావిస్తున్నాయి. ఆ తర్వాత సీబీఐ ద్వారా ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించి, భట్టిపై రెడ్ కార్నర్ నోటీసు (=జచీ) జారీ చేయించాలని సన్నాహాలు చేస్తున్నాయి.

## 'మా ఆస్తులపై విచారణకు సిద్ధం.. మీరూ సిద్ధమా?'

**కేసీఆర్‌కు ఉన్నది 67 ఎకరాలే.. వెయ్యి ఎకరాలు కాదు: కేటీఆర్**



హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ముఖ్యమంత్రి విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాలు లేవని, కేవలం 67 ఎకరాల భూమి మాత్రమే ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి స్వయంగా అసెంబ్లీ వేదికగా అంగీకరించారని గుర్తుచేశారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రికి కేటీఆర్ సవాల్ విసిరారు. కేసీఆర్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు తమ కుటుంబానికి సంబంధించిన ఆస్తులపై పూర్తిస్థాయి విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అదే విధంగా రేవంత్‌రెడ్డి పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఆయన ఆస్తులపైనా విచారణకు సిద్ధమా? అని ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవసాయాన్ని ప్రేమించే నిజమైన రైతు అని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన వ్యవసాయం చేశారని గుర్తుచేశారు. కొందరు భూమిని వ్యాపార వస్తువుగా చూస్తారని, కేసీఆర్ మాత్రం భూమిని పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై అనవసర రాద్ధాంతం చేస్తూ రేవంత్‌రెడ్డి తనకుతానే ఇబ్బందులు తెచ్చుకుంటున్నారని విమర్శించారు. కేసీఆర్ తండ్రికి గతంలో వందల ఎకరాల ఆస్తి ఉండేదని కేటీఆర్ తెలిపారు. చింతమడకలోని తమ పాత ఇంటిని ప్రభుత్వ పాఠశాల కోసం విరాళంగా ఇచ్చామని గుర్తుచేశారు. 22ఏ భూముల సమస్యతో ఇబ్బందులు పడుతున్న వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లి ప్రశ్నిస్తామని కేటీఆర్ పునరుద్ఘాటించారు.

## నిజామాబాద్‌లో యూట్యూబర్ వైష్ణవి భర్త హత్య

వైష్ణవి భర్త చిట్టారి హరిబాబు (26)ను గుర్తుతెలియని వ్యక్తి కిరాతకంగా నరికి చంపాడు. నగరంలోని రాజరాజేంద్ర చౌరస్తా వద్ద ఈ ఘోరం జరిగింది. పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హరిబాబుపై ఓ వ్యక్తి కొబ్బరి బొండాలు నరికే కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి ప్రాణాలు తీశాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ దాడిలో ముగ్గురు నిందితులు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. మిగతా వారు కారులో ఉండగా, ఓ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు.జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి (19)కి, కోరుట్ల పట్టణంలోని ఏసుకోనిగుట్ట ప్రాంతానికి చెందిన హరిబాబుతో వివాహం జరిగింది. అయితే, గతంలో యూట్యూబర్‌గా గుర్తింపు పొందిన వైష్ణవి దారుణ హత్యకు గురైంది. ఆ సమయంలో ఆమె నాలుగు నెలల గర్భిణి. భర్త హరిబాబు ఆమెను గొంతు నులిమి చంపడమే కాకుండా, చేతులు, నుదుటిపై కత్తితో పొడిచినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.వైష్ణవి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు హరిబాబును అరెస్ట్ చేసి జైలుకు పంపారు. కొంతకాలం రిమాండ్‌లో ఉన్న అతడు, ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యాడు. ఈ క్రమంలోనే పాత కక్షల నేపథ్యంలో ప్రత్యర్థులు పథకం ప్రకారం హరిబాబును హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

# అసోషలిజం దిశగా అమెరికన్ యువత, కార్మికవర్గం!

**దేశభక్తి యుతంగా పెట్టుబడిదారీ విధానం పని చేస్తున్నదని సగం మంది కంటే తక్కువ మంది అమెరికన్లు అనుకుంటున్నారు, ప్రజాస్వామ్యానికి మద్దతు పడిపోయింది. న్యూయార్క్ పోస్ట్. 'హౌస్ ప్రైమరీస్' (పార్లమెంటు ప్రజాప్రతినిధుల సభ కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం పార్టీలో జరిగే పోటీ)లో ఆకస్మికంగా డెమోక్రటిక్ సోషలిస్టులు ఎందుకు దూసుకుపోతున్నారు–న్యూస్ వీక్. అంకెలు అబద్ధాలు చెప్పవు. యువ అమెరికన్లు సోషలిజం ప్రేమలో పడుతున్నారు– ఫాక్స్ న్యూస్. సోషలిజానికి పెరుగుతున్న యువత మద్దతు తొలి రోజుల అమెరికా పాఠాలను గుర్తుకు తెస్తున్నది– కరోలినా జర్నల్. అమెరికాలో పెట్టుబడిదారీ విధానపు ప్రతిష్ట 54 శాతానికి పడిపోయింది–గాలప్ న్యూస్.**



పైన పేర్కొన్నవి అమెరికన్ మీడియాలో గత ఏడాది కాలంలో, ఇటీవల వచ్చిన కొన్ని వార్తా వ్యాఖ్యల శీర్షికలు. అక్కడి సమాజంలో వస్తున్న ఆలోచనా ధోరణులను ఇవి ప్రతిబింబిస్తున్నాయి. వీటిని చూసి డోనాల్డ్ ట్రంప్ వంటి నయా ఫాసిస్టులు తమ ఆందోళన, అక్కసులను బహిరంగంగానే వెళ్లగక్కుతున్నారు. దీన్ని బట్టి వెంటనే అమెరికాలో సోషలిస్టు వ్యవస్థ ఏర్పాటు కానుందని ఎవరూ నిర్ధారణకు రానవసరం లేదు. అక్కడి పాలకవర్గం అంత తేలికగా తన అధికారాన్ని వదులుకోదు.

గత గురువారం నాడు వాషింగ్టన్ పోస్టు పత్రిక – ఐసోస్ వెల్లడించిన సర్వే వివరాల ప్రకారం వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో సోషలిస్టు అభ్యర్థి రంగంలో ఉంటే ఓటు వేయటం గురించి ఆలోచిస్తామని నమోదైన ఓటర్లలో 40 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఇలాంటి వారు మూడు పదుల వయస్సులోపు వారు 46 శాతం మంది, డెమోక్రటిక్ పార్టీ మద్దతుదార్లలో 64 శాతం ఉన్నట్లు కూడా సర్వే పేర్కొన్నది. ఈ పత్రిక అమెజాన్ కంపెనీ అధిపతి జెఫ్ బెజోస్ యాజమాన్యంలో నడుస్తున్నది. అలాంటి కార్పొరేట్ల పత్రిక ఎవరి ప్రయోజనాల కోసం పని చేస్తుందో తెలిసిందే. అయితే సర్వేలను తిమ్మిని బమ్మిని చేస్తే కుదరదు గనుక ఇష్టం ఉన్నా లేకున్నా వివరాలను వెల్లడించక తప్పటం లేదు. అయితే ఈ సర్వే వార్తలోనే ఎక్కువ మంది అమెరికన్లు డెమోక్రటిక్ సోషలిస్టు పార్టీ (డిఎస్‌పి) అభ్యర్థికి మద్దతు ఇవ్వటం లేదని కూడా రాసింది. సిఎన్ఎన్ మీడియా సంస్థ కోసం ఎస్–ఎస్ఆర్ఎస్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో డెమోక్రాట్లు, ప్రజాస్వామిక భావాలకు మద్దతు ఇచ్చే వారిలో మూడో వంతు మంది తాము డెమోక్రటిక్ సోషలిస్టులమని చెప్పుకున్నారని, వారిలో 45 ఏళ్ల లోపు వారు 59 శాతం మంది ఉన్నట్లు తేలింది. మూడింట రెండు వంతుల మంది నవంబరు మూడున జరిగే ఎన్నికల్లో కచ్చితంగా ఓటు వేస్తామని కూడా చెప్పారు. డెమోక్రటిక్ పార్టీలో తెల్లవారితో పోల్చితే ఆఫ్రో–అమెరికన్లు బాహాటంగా తాము డెమోక్రటిక్ సోషలిస్టుకే ఓటు వేస్తామని చెప్పారు. డెమోక్రటిక్ సోషలిస్టులుగా చెప్పుకున్న వారిలో 66 నుంచి 54 శాతం మందికి డిగ్రీలు లేవు, వారి వార్షిక ఆదాయం 76 నుంచి 65 శాతం మందికి లక్ష డాలర్ల లోపే ఉంది. దీన్ని మరో విధంగా చెప్పాలంటే మన దేశంలో చెప్పుకొనే బడుగు బలహీన వర్గాలు అమెరికాలో సోషలిజానికి అనుకూలంగా ఉన్నాయి. డెమోక్రటిక్ సోషలిస్టుల్లో 48 శాతం మంది గాజాలో మారణకాండకు పాల్పడిన ఇజ్రాయిల్‌కు అమెరికా సాయం నిలిపివేయాలనే అభ్యర్థికే మద్దతు ఇస్తామని చెప్పటం కూడా గమనించాల్సిన అంశం. అమెరికా సమాజం మొత్తంగానే ఇరాన్‌పై జరుపుతున్న యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నది. శ్వేత జాతీయుల్లో ఎగువ మధ్య తరగతి మాత్రమే సోషలిజానికి అనుకూలంగా ఉన్నట్లు మీడియాలో వచ్చే విశ్లేషణలు వాస్తవం కాదని కూడా సిఎన్ఎన్ సర్వే తేల్చింది. జీవిత అనుభవాల నుంచే జనాలు సోషలిజానికి మద్దతు ఇస్తారని ప్రపంచ వ్యాపితంగా వెల్లడైన సత్యం. దీనికి అమెరికన్లు మినహాయింపు ఎలా అవుతారు! దోపిడీ స్వభావం కలిగిన పెట్టుబడిదారీ వ్యవస్థ వైఫల్యం ఎంత ఎక్కువగా కనిపిస్తే అంతగా ప్రత్యామ్నాయ విధానాలవైపు జనాలు చూస్తారు.

పార్లమెంటు మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రటిక్ సోషలిస్టులకు పెరుగుతున్న మద్దతు గురించి ఆ పార్టీలోని మితవాదులు కూడా ఆందోళన చెందుతున్నారు. జులైలో న్యూయార్క్, కొలరాడోలో అభ్యర్థిత్వాలకు డెమోక్రటిక్ పార్టీలో జరిగిన ఎన్నికల్లో నాలుగు ప్రజాప్రతినిధుల స్థానాల్లో డిఎస్‌పి మద్దతు ఉన్న అభ్యర్థులే గెలిచారు. ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న వారిని ఓడించారు. ఇటీవల సిఎన్‌బిసి చేసిన సర్వేలో డోనాల్డ్ నినాదమైన 'మాగా' (అమెరికాను మరోసారి గొప్పదానిగా చేయాలి) కంటే డెమోక్రటిక్ సోషలిజం నినాదమే బహళ ఆదరణ కలిగి ఉందని తేలింది. డెమోక్రటిక్ సోషలిస్టు పార్టీ అభ్యర్థులను చూపి భయపెట్టటాన్ని డెమోక్రటిక్ పార్టీ మానుకోవాలని కొందరు సలహా ఇచ్చారట. ఎందుకంటే ఎంతగా వ్యతిరేకిస్తే అంతగా ఆదరణ పొందుతున్నట్లు న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికలో జోహ్రాన్ మందానీ విజయం వెల్లడించింది. అమెరికాలో తనను వ్యతిరేకించేవారందరికీ డోనాల్డ్ ట్రంప్ " కమ్యూనిస్టు " ముద్ర వేస్తున్నాడు. ఇది నష్టదాయకమని రిపబ్లికన్ మేధావులు వాపోతున్నారు. ప్రతివారినీ కమ్యూనిస్టులని ముద్రవేస్తే సభల్లో చప్పట్లు కొట్టవచ్చు, ఈలలు వేయవచ్చు, ఒకటి రెండు సార్లు మధ్యంతర ఎన్నికల్లో ఓట్లు కూడా పడవచ్చు గానీ పదే పదే ప్రతివారినీ కమ్యూనిస్టు అంటే అవును అయితే ఏమిటి అని యువతరం ప్రశ్నించే పరిస్థితి రావచ్చని హెచ్చరిస్తున్నారు. నిజానికి గత కొద్ది సంవత్సరాలుగా అదే జరుగుతున్నది. పెట్టుబడిదారీ విధానం విఫలమైందని ఒకవైపు దాని సమర్ధకులే చెబుతుండగా మరోవైపు సోషలిస్టు చైనా సాధిస్తున్న అద్భుత విజయాలు, అమెరికాను సవాలు చేస్తున్న తీరును చూసి యువత సోషలిజం పట్ల సానుకూల వైఖరిని పెంచుకుంటున్నది. ట్రంప్ సర్కార్ కొన్ని స్వతంత్ర వాణిజ్య సంస్థలను ప్రభుత్వ ఆధీనంలోకి తెస్తున్నదని, కమ్యూనిస్టులు అదే చేస్తారని గతంలో పెద్ద ఎత్తున ప్రచారం చేసినందున ఇప్పుడు ట్రంప్ చర్యలను "మాగా మావోయిజం " అని వర్ణిస్తున్నారని, కమ్యూనిస్టులను భూతాలుగా చూపి భయపెట్టే క్రమంలో ఉదారవాదులకు సైతం అలాంటి ముద్ర వేస్తూ ట్రంప్ నష్టం చేస్తున్నారని, ఎన్నికల ముందు తెలివైన అమెరికన్ ఓటర్లు వీటన్నింటినీ గుర్తు చేసుకుంటారని రిపబ్లిక్లన్ మేధావులు హెచ్చరిస్తున్నారు.

ఇదే సమయంలో కాల చక్రాన్ని వెనక్కు తిప్పాలని చూస్తున్న పచ్చి మితవాద రిపబ్లికన్లు కూడా ఉన్నారు. 1950 దశకంలో మాదిరి కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొట్టటం తప్ప మరొక మార్గం లేదని భావిస్తున్నారు. వారి బుర్రలకు ఎక్కనిదేమంటే అప్పుడూ ఇప్పుడూ పరిస్థితి ఒకే విధంగా లేదు. నాడు సోషలిస్టు, కమ్యూనిస్టు భావనలు యావత్ ప్రపంచాన్ని ఊపివేశాయి. ఇప్పుడు అలా లేదు. కమ్యూనిజాన్ని అంతం చేశామని చెప్పుకున్నవారే ఇప్పుడు కమ్యూనిస్టు బొమ్మ భూతాన్ని వీధుల్లోకి తీసుకువచ్చి గుండెలు బాదుకుంటూ భయాన్ని నటిస్తే జనాలు నవ్వుతారు తప్ప నమ్మరు.

# బీజేపీకి ఎదురుగాలి

**దేశంలోని మూడు రాష్ట్రాల్లో ఇటీవల మూడు అసెంబ్లీ సీట్లకు ఉపఎన్నికలు జరిగాయి. ఈ మూడుచోట్లా మూడు వేర్వేరు పార్టీలు గెలిచాయి. స్థూల దృష్టికి ఇది సాధారణ విషయంలా అనిపించవచ్చు. కానీ ఈ ఫలితాలకు ఓ ప్రత్యేకత ఉన్నది. ఇవి దేశంలో మారుతున్న లేదా చాలావరకు మారిపోయిన రాజకీయ దృశ్యాన్ని మనకు చూపిస్తున్నాయి. పన్నెండేండ్ల పైచిలుకు కాలంగా కేంద్రంలో సాగుతున్న ఎన్డీయే అప్రతిహత పాలనకు ఇవి ప్రమాద ఘంటికలు మోగించాయని మాత్రం చెప్పవచ్చు. మొదటిది, నితీశ్‌కుమార్‌ను తప్పించి బీజేపీ అధికార పగ్గాలు చేపట్టిన బీహార్‌లో సుప్రసిద్ధ ఎన్నికల విశ్లేషకుడు, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ బాంకీపూర్ ఉపఎన్నికలో సాధించిన అనూహ్య విజయం. పాలకపక్ష అభ్యర్థిపై 19 వేల ఆధిక్యంతో ఆయన గెలుపొందారు. బీజేపీ కంచుకోట బద్దలు చేశాడంటూ ఆయనపై ప్రశంసలు కురుస్తుండటం గమనార్హం. రెండోది, గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారం దక్కించుకున్న మధ్యప్రదేశ్‌లోని దతియా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఘన్‌శ్యామ్ సింగ్ బీజేపీ అభ్యర్థి అశుతోష్ తివారీపై 6 వేల ఓట్లతో గెలువడం. మూడోది, గుజరాత్‌లోని మంజల్‌పూర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి సతీశ్ గోవింద్‌భాయ్ పటేల్‌ను 30 వేల మెజారిటీతో ఓడించడం.**



దేశం ఎంతో ఆసక్తిగా గమనించిన ఈ మూడు ఉపఎన్నికల ఫలితాలు నిర్ణాయకమైనవి కాకపోవచ్చు గానీ, ఓటర్ల ఆలోచనలో వచ్చిన మార్పునకు, బీజేపీకి వీస్తున్న ఎదురుగాలికి అవి అద్దం పడుతున్నాయని మాత్రం చెప్పవచ్చు. పై మూడు ఫలితాల్లో ప్రశాంత్ కిశోర్ విజయం గురించే ఎక్కువగా చర్చ జరుగడానికి పలు కారణాలు ఉన్నాయి. ఆయన గెలిచిన బాంకీపూర్ నియోజకవర్గం బీజేపీకి ప్రతిష్ఠాత్మకమైందని చెప్పాల్సిన పనిలేదు. పైగా అది ఆ పార్టీ జాతీయ అధ్యక్షునిగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్ రాజ్యసభకు వెళ్లడంతో ఖాళీ అయ్యింది కావడం, ఉపఎన్నికలో అధికార పార్టీ గెలువడం అనే ఆనవాయితీకి విరుద్ధంగా ఫలితం రావడం గమనార్హం. 31 సంవత్సరాలుగా గెలుస్తున్న స్థానం కోల్పోవడం అనేది పాలకపక్షానికి ఓ సంకేతం. గత ఎన్నికల్లో ఏమాత్రం ప్రభావం చూపని జన్ సురాజ్ పార్టీ నేత భారీ మెజారిటీతో గెలువడం ఓటర్ల దృక్పథంలో వచ్చిన కచ్చితమైన మార్పును సూచిస్తున్నది. మధ్యప్రదేశ్‌లోనూ పాలక బీజేపీకి చుక్కెదురు కావడం మరో సంకేతం. ఇక సంప్రదాయికంగా బీజేపీ రాష్ట్రంగా కొనసాగుతున్న గుజరాత్‌లో అధికారపక్ష అభ్యర్థి గెలిచినప్పటికీ 2022లో వచ్చిన లక్ష ఓట్ల ఆధిక్యం కాస్తా 30 వేలకు పడిపోవడం పార్టీ బలం సన్నగిల్లిందనడానికి నిదర్శనం. ఏ రకంగా చూసినా ఈ మూడు ఫలితాలు బీజేపీకి, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీకి కునుకు లేకుండా చేసేవిగానే ఉన్నాయి. ఓటర్లు ప్రత్యామ్నాయాల వైపు, ప్రయోగాల వైపు చూస్తున్నారని ఈ మూడుచోట్ల వెలువడిన ఫలితాలు తేటతెల్లం చేస్తున్నాయి. బీజేపీ సహా బీహార్‌లో పాతుకుపోయిన పార్టీలకు వారు అంతగా ప్రాముఖ్యం ఇవ్వలేదు. బాంకీపుర్‌లో తాము 'కుక్కను నిలబెట్టినా, పిల్లిని పోటీకి పెట్టినా' గెలుపు తమదేనని విర్రవీగిన బీజేపీకి ఓటర్లు గట్టి గుణపాఠం చెప్పారు. ఢిల్లీలో జెన్–జీ ఆందోళన ఫలితంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, అయోధ్య రామాలయంలో విరాళాల చోరీపై ఉధృత స్థాయిలో దర్యాప్తు జరుగుతున్న నేపథ్యంలో ఈ ఉపఎన్నికలు జరిగాయనేది గుర్తుంచుకోవాలి. బీజేపీకి ఇన్నాళ్లూ అండగా నిలిచిన వర్గాలు దూరమవుతున్నాయని ఫలితాలు తెలియజేస్తున్నాయి. మతపరమైన విభజన రాజకీయాలు, ప్రగతి, సంక్షేమాలను పక్కనబెట్టి కార్పొరేట్ల కొమ్ముకాసే విధానాల పట్ల ఓటర్లలో విముఖత ఏర్పడింది. ప్రజల బాగోగులు పట్టించుకునే రాజకీయాలు కావాలన్న ప్రశాంత్ కిశోర్ వైపు ఓటర్లు మొగ్గడం విశేషం. పాతుకుపోయిన ఆర్జేడీ వంటి పార్టీలనూ పక్కన పెట్టడం కొసమెరుపు.

## సంపాదకీయం



# తగ్గిన పతకాలు...

**ఒక దేశం క్రీడల్లో సాధించే విజయాలను కేవలం పతకాల సంఖ్యతో మాత్రమే కొలవలేం. అవి ఆ దేశ విద్యా విధానం, ప్రజారోగ్యం, శాస్త్రీయ దృష్టి, పరిపాలనా సామర్థ్యం, సామాజిక సమానత్వం, భవిష్యత్ ప్రణాళికలకు అద్దం పడతాయి. ఈ కోణంలో చూస్తే గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో భారత్ నాలుగో స్థానంలో నిలవడం కంటే, కేవలం 39 పతకాలతో సరిపెట్టుకోవడం మరింత ఆందోళన కలిగించే విషయం. కొన్ని క్రీడలను తొలగించడాన్ని దీనికి కారణంగా చెబుతున్నప్పటికీ 2022 బర్మింగ్ హామ్ సాధించిన 61 పతకాలతో పోలిస్తే ఇది భారీ వెనుకడుగు. అప్పుడు సాధించిన నాలుగో స్థానం నిలిచిందన్న ఓదార్పు ఉన్నా, పతకాల సంఖ్యలో చోటుచేసుకున్న పతనం మన క్రీడా వ్యవస్థలోని లోపాలను మరింత స్పష్టంగా బయటపెట్టింది. నిజానికి కామన్వెల్త్ క్రీడలకు ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. ఒకప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యానికి విధేయతను ప్రదర్శించే వేదికగా ఇవి ప్రారంభమైనాయి. నేడు స్వతంత్ర దేశాల క్రీడా పోటీల రూపంలో కొనసాగుతున్నా, వాటి చరిత్ర మాత్రం వలస పాలన జ్ఞాపకాలను మోస్తూనే ఉంది. రవి అస్తమించని సామ్రాజ్యం అంతరించిపోయింది. జెండాలు మారాయి. దేశాలు స్వతంత్రమయ్యాయి. కానీ ఆ వలస నిర్మాణం సృష్టించిన వేదిక ఇంకా కొనసాగడం గమనార్హం. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన మన దేశం అదే వేదికపై ఇప్పటికీ నాలుగో స్థానానికే పరిమితమవడం, దానినే గొప్పగా మన పాలకులు చిత్రీకరించే ప్రయత్నం చేయడం బాధాకరం! నిజానికి ఈ స్థానం, పతకాలు తగ్గడం మన దేశ క్రీడా విధానానికి, ప్రభుత్వ ప్రాధాన్యతలకు, అభివృద్ధి నమూనాకు అద్దం పట్టే వాస్తవం! స్వాతంత్రం వచ్చిన ఇన్నేళ్ల తరువాత కూడా స్వదేశీ క్రీడా నిర్మాణంపై మనం ఇంకా పూర్తి స్థాయి దృష్టి సారించలేదనడానికి ఇది ఒక సంకేతం కూడా!**

ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, కెనడా వంటి దేశాలు పతకాల పట్టికలో భారత్‌ను దాటి నిలవడం యాదృచ్ఛికం కాదు. ఆ దేశాలు సంవత్సరాల ప్రణాళికతో క్రీడా వ్యవస్థను నడుపుతున్నాయి. అందుకే ఆస్ట్రేలియా 171 పతకాలతో, ఇంగ్లాండ్ 110, కెనడా 62 పతకాలతో మన దేశాన్ని అధిగమించాయి. కామన్వెల్త్ క్రీడల్లో సంప్రదాయంగా మన దేశం వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, షూటింగ్, బ్యాడ్మింటన్ వంటి కొద్ది విభాగాలపైనే ఆధారపడుతూ వచ్చింది. ఆ విభాగాల్లో ఒకటి లేదా రెండు ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వకపోతే మొత్తం పతకాల పట్టిక కూలిపోతుంది. ఈసారి అదే జరిగింది. అత్యధిక జనాభా, అపార యువశక్తి ఉన్న దేశానికి పతకాల ఆధారం ఇంత సంకుచితంగా ఉండడం వ్యవస్థాగత వైఫల్యమే. నిజానికి మన దేశంలో ప్రతిభ కొరవడలేదు. ఆ ప్రతిభను గుర్తించే, తీర్చిదిద్దే, నిలబెట్టే వ్యవస్థ, ఆ చిత్తశుద్ధిని చూపే పాలకులే కొరవయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ, చిన్న పట్టణాల్లోనూ వేలాది మంది యువ క్రీడాకారులు ఉన్నా, వారికి అంతర్జాతీయ ప్రమాణాల కోచింగ్, పోషకాహారం, స్పోర్ట్స్, సైన్స్, వైద్య సహాయం, మానసిక శిక్షణ, నిరంతర ఆర్థిక భరోసా అందుబాటులో ఉండటం లేదు. పాఠశాలలకు మైదానాలు ఉండటం లేదు. వేలాది పాఠశాలల్లో శారీరక విద్య ఉపాధ్యాయులే లేరు. జిల్లా స్థాయి స్టేడియాలు నిర్వహణ లేక శిథిలమవుతున్నాయి. ప్రభుత్వ క్రీడా సంఘాలు రాజకీయ జోక్యానికి వేదికలవుతు న్నాయి. విద్యావ్యవస్థను కబళించిన కార్పొరేట్ వ్యవస్థ క్రీడా రంగాన్ని నిలువునా మింగేస్తోంది. ఈ పరిస్థితుల్లో పతకాలు సాధించే క్రీడాకారులను మన వ్యవస్థ సృష్టించిన ఫలితాలుగా చూపడం, ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకోవడం సరికాదు. నిజానికి వారు ఆ అస్తవ్యస్థ వ్యవస్థను ఎదిరించి, క్రీడా లోకంలో మెరిశారు.ప్రపంచ క్రీడలు చాలా కాలం క్రితమే కొత్త దశలోకి ప్రవేశించాయి. నేడు విజయం కేవలం శారీరక ప్రతిభపై ఆధారపడదు. బయోమెకానిక్స్, డేటా అనలిటిక్స్, కృత్రిమ మేధస్సు ఆధారిత శిక్షణ, గాయాల నిర్వహణ, మానసిక దృఢత్వం, పోటీ వ్యూహాలు ఇవన్నీ క్రీడల్లో భాగమైనాయి. పతకాల సాధనలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ రంగాలపై శ్రద్ధ చూపి, పెట్టుబడులు పెట్టిన దేశాలే ప్రపంచ క్రీడా పటంలో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఆ దేశాలు ప్రతి నాలుగేళ్లకోసారి క్రీడాకారుల జాబితాను తయారు చేయడానికి బదులుగా దశాబ్దాలపాటు కొనసాగే శాస్త్రీయ ప్రణాళికలతో క్రీడా సంస్కృతిని నిర్మిస్తాయి. అందుకే అవి పతకాల పట్టికలో నిరంతర ఆధిక్యాన్ని కొనసాగిస్తున్నాయి. మన పొరుగనే ఉన్న చైనా దీనికి ఓ ఉదాహరణ. మన దేశంలో మాత్రం ఆ పరిస్థితి కనిపించదు. రాబోయే ఆసియా క్రీడలు, ఒలింపిక్స్ మరింత కఠినమైన వేదికలు. అక్కడ చైనా, జపాన్, దక్షిణ కొరియా, అమెరికా, యూరప్ దేశాల వంటి క్రీడా శక్తులతో పోటీ పడాల్సి ఉంటుంది. కామన్వెల్త్ లోనే పతకాల సంఖ్య తగ్గుతున్నప్పుడు, మరింత తీవ్రమైన పోటీ ఉండే చోట ఫలితాలు ఎలా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 2030 వ సంవత్సరంలో మన దేశం కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వనుంది. పోటీలకు ఆతిధ్యం ఇవ్వడమంటే అత్యాధునిక స్టేడియాలు నిర్మించడం మాత్రమే కాదు. ఆ వేదికపై మన దేశ ప్రతిభను చాటగలగాలి కూడా! ఆ మేరకు అవసరమైన క్రీడా వ్యవస్థను నిర్మించడంపై ప్రభుత్వం తక్షణం దృష్టి సారించాలి. మహిళలు, గిరిజనులు, గ్రామీణ యువతకు ప్రత్యేక ప్రోత్సాహం ఇస్తూ ప్రతిభను గుర్తించాలి. పాఠశాల స్థాయి నుంచే క్రీడలను విద్యలో అంతర్భాగం చేయడం, ప్రతి రాష్ట్రంలో సమాన అవకాశాలు కల్పించడం, వంటి అంశాలతో సమగ్ర క్రీడా విధానాన్ని రూపొందించి అమలు చేయాలి.

ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 2030 కామన్వెల్త్ క్రీడలను కేవలం ఆతిధ్యానికే కాకుండా మన క్రీడా వ్యవస్థ నిర్మాణానికి కేంద్ర బిందువుగా మార్చాలి. లేనిపక్షంలో కామన్వెల్త్‌లో కనిపించిన ఈ స్తబ్దత, రేపటి ఆసియా క్రీడల్లోనూ, ఒలింపిక్స్‌లోనూ పునరావృతమయ్యే ప్రమాదం ఉంది.



**-గుర్రం పాపిరెడ్డి**
-ఎడిటర్

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY



# భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జన ఉత్సవాలు నిర్వహించాలి

### శాంతియుత వాతావరణంలో వేడుకలు..
### అధికారులకు భక్తులు సహకరించాలి
### ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్ : వినాయక నిమజ్జన ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భక్తులకు పిలుపునిచ్చారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అధికారులు చేస్తున్న ఏర్పాట్లకు భక్తులు సహకరించాలని కోరారు. వేములవాడ పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువు వద్ద ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న వినాయక నిమజ్జన కార్యక్రమం కోసం చేపడుతున్న ఏర్పాట్లను గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే కలిసి పరిశీలించారు. నిమజ్జనానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను అధికారులు వారికి వివరించారు. నిమజ్జన ప్రాంతంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై అధికారులు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వినాయక నిమజ్జన వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. పోలీస్, మున్సిపల్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సూచించే నిబంధనలు పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా



నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నిమజ్జనానికి వచ్చే భక్తుల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కవ్వగూడ గ్రామానికి రూ.3.30 కోట్ల నిధులు

### దొడ్డి-కవ్వగూడ డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు
### అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

అరుణ ప్రభ -- రాజేంద్రనగర్ సెప్టెంబర్ 17: రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కవ్వగూడ గ్రామ సమగ్ర అభివృద్ధికి రూ.3 కోట్ల 30 లక్షల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ తెలిపారు. దొడ్డి నుంచి కవ్వగూడ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఈ నిధులను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం కవ్వగూడ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రతిపక్షాలు వాస్తవాలు తెలుసుకోకుండా విమర్శలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కవ్వగూడ గ్రామంలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుక్కల ఇంద్రమ్మ ముదిరాజ్, ఉప సర్పంచ్ రాజ్యు సత్తయ్య ముదిరాజ్, వార్డు సభ్యులు యాదమ్మ, ముగ్గురుపా శ్రీనివాస్, ఆకుల రమేష్



గౌడ్, మొడిగం సువర్ణ, కౌండి సురేష్, మంగళవారం భాగ్యమ్మ, రాపోలు ఇందిరా శ్రీరామ్ తదితరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేట మండలంలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

### రెపరెపలాడిన జాతీయ జెండాలు





ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్ : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఎల్లారెడ్డిపేట మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. దీంతో ఆయా కార్యాలయాల వద్ద జాతీయ జెండాలు రెపరెపలాడాయి. ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ దివ్యజ్యోతి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో సత్తయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సర్పంచ్ ఎనుగందుల నరసింహులు జెండాను ఎగురవేశారు. ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ ఎదుట సీఐ ఓ. వెంకటేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సింగిల్ విండో కార్యాలయం వద్ద సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూడిది రాజేందర్, బీజేపీ కార్యాలయం ఎదుట బీజేపీ మండల శాఖ అధ్యక్షులు రేపాక రామచంద్రారెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. రాచర్ల బొప్పాపూర్ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ సబేరా బేగం జాతీయ జెండాను ఎగురవేశారు. నారాయణపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సర్పంచ్ దొమ్మాటి నరసయ్య, గొల్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, అక్కపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సర్పంచ్ మాదాసు స్రవంతి బాబు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. తెలంగాణ ప్రజల చారిత్రక పోరాటాన్ని స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ దేశభక్తి, ఐక్యతా భావాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ వేణు, ఆర్ఐ సహితి, వైస్ చైర్మన్ గుండాడి రామ్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు బీపేట రాజ్‌కుమార్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్.కే. సాహెబ్, సీనియర్ నాయకులు చేపూరి రాజేశం గుప్తా, బండారి బాల్‌రెడ్డి, నంది కిషన్, వంగ శ్రీకాంత్‌రెడ్డి, టౌన్ అధ్యక్షులు చెన్ని బాబు, సీనియర్ కార్యకర్త కంచర్ల రాజు, మాజీ సర్పంచ్ శ్రీను, ఎడ్ల రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మేడిపల్లి రవి, పొన్నాల తిరుపతిరెడ్డి, మెండే శ్రీనివాస్ యాదవ్, గంట అంజయ్య, అందే సతీష్, సాదిక్ హిమం, రాజేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఉడుగుల సురేందర్, షకీల్, రేసు శంకర్, గుర్రపు రాములు, ఏర్పుల శ్రీనివాస్, మద్దుల పద్మారెడ్డి, కార్యదర్శి కృష్ణ, ఉపసర్పంచ్ బంధారపు బాల్‌రెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## విద్యా సామాగ్రి పంపిణీ

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు రూరల్ మండలం పారిచర్ల రాజాపాలెం గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో విద్యార్థులకు కుర్చీలు, విద్యా సామగ్రి వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి రోటేరియన్ కనుమర్లపూడి శ్రీనివాసరావు దాతగా వ్యవహరించారు. అంగన్‌వాడి కేంద్రం, ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా కుర్చీలు, అవసరమైన విద్యా సామగ్రిని అందజేశారు. విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చొని చదువుకునేందుకు అవసరమైన సదుపాయాలను కల్పించడం పట్ల పాఠశాల, అంగన్‌వాడి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ అధ్యక్షుడు ఆర్‌టీఎన్. ఎన్. కృష్ణం రాజు మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తు కోసం సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సమాజంలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి సేవా కార్యక్రమాలు నిర్వహించడం రోటరీ క్లబ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకునే పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. విద్యార్థులకు మంచి విద్యా వాతావరణం కల్పిస్తే వారి భవిష్యత్తుకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.విద్య, వైద్యం, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి సామాజిక అంశాలపై రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎన్. కృష్ణం రాజు తెలిపారు.ఈ కార్యక్రమానికి గ్రామ అధ్యక్షుడు రాజు వెంకటేశ్వర రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ కార్యదర్శి ఆర్‌టీఎన్. ఎం. హరనాథ్ రెడ్డి, అంగన్‌వాడి టీచర్ కే. కవిత, టీచర్ జై కళ్యాణ్, బి. ధనుంజయ రెడ్డి, శ్రీనివాసులు, ఎం. సుబ్రహ్మణ్యం రాజు, ఏ. బలరాంరెడ్డి, ఎస్.కె. మహబూబా, సీడీపీఓ సుజనా, సూపర్‌వైజర్‌తో పాటు పాఠశాల, అంగన్‌వాడి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను అందించిన రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ సభ్యులకు గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.



## మన కృషికి భగవంతుని కృప తోడైతేనే మంచి భవిష్యత్తు

### ముఖ్య అతిథులుగా డాక్టర్ ఆర్.వి. చాణక్య, డాక్టర్ బి. సాహితిరావు

గజ్వేల్ అరుణ ప్రభ : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప నగర్ కాలనీలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజా కార్యక్రమం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌వీఆర్ హాస్పిటల్ యాజమాన్య బృందం సభ్యులు డాక్టర్ ఆర్.వి. చాణక్య, డాక్టర్ బి. సాహితి రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.వి. చాణక్య మాట్లాడుతూ మానవ కృషికి భగవంతుని కృప తోడైతేనే మంచి ఫలితాలు సాధించి, అందరికీ మంచి భవిష్యత్తు ఏర్పడుతుందని అన్నారు. సమాజంలో మంచి భవిష్యత్తు కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు స్వయం కృషి కూడా అవసరమని, అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. చాలామంది దంపతులు సంతానం కలగక మూఢనమ్మకాలతో సమయాన్ని వృథా చేసుకుంటున్నారని అన్నారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని నైపుణ్యం కలిగిన వైద్యులను సంప్రదిస్తే, వారి సూచనలను పాటించడం ద్వారా సంతానం పొంది ఆనందంగా జీవించే అవకాశం ప్రతి దంపతికి ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఆర్‌వీఆర్ హాస్పిటల్ తరపున పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో చేపట్టే సేవా కార్యక్రమాలకు భగవంతుని కృప ఉండాలని ప్రార్థిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి ఆహ్వానించిన వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు డాక్టర్ చాణక్య, డాక్టర్ సాహితి రావు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది ఖాళీ ప్రసాద్, అధ్యక్షులు మోతె వీరారెడ్డి, కమిటీ కార్యవర్గ సభ్యులు, అయ్యప్ప నగర్ కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

## ఓటర్ల నోటీసుల పరిష్కారం మరింత సులభతరం

హైదరాబాద్, సప్టెంబర్ 17 : సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు అందించిన నోటీసుల పరిష్కార ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం మరింత సులభతరం చేసింది. ఇప్పటి వరకు ఓటర్ల కు అందించిన నోటీసులను పరిష్కరించేందుకు సంబంధిత ఓటర్ కుటుంబ సభ్యులలో ఎవరైనా ఒకరు (adult family member) ఇఆర్ఒ/ఎఇఆర్ఒల ఎదుట వ్యక్తిగతంగా హాజరై తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన అవసరమైన పత్రాలు, అవసరమై సమాచారాన్నిఅందించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని సిఇఒ సుదర్శన్ రెడ్డి ఐఎ ఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ కు సంబంధించిన పత్రాలను స్వీకరించి జారీ చేసిన నోటీసుల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారులకు దీనికి సంబంధించిన సమాచారాన్ని అందించామని, దానికి అనుగుణంగా ఓటర్లకు ఇచ్చిని నోటీసులను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా ఫారం-6కు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, డిక్లరేషన్ ఫారం స్వీకరణ, క్లెయిమ్ ల పరిష్కార ప్రక్రియలో భాగంగా అర్హత తేదీ 1.10.2026 పరిగణిస్తూ ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న ఫారం-6 దరఖాస్తులకు, అలాగే భవిష్యత్ లో అందే ఫారం-6 దరఖాస్తులకు సంబంధించి నిర్దేశిత డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా స్వీకరించాలని సిఇఒ ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ భారత ఎన్నికల సంఘం నిబంధనాలకు అనుగుణంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సిఇఒ సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.



## వినాయక మండపాన్ని సందర్శించిన కారుమూరి వెంకటరెడ్డి

### ప్రత్యేక పూజలు.. ఘనంగా సన్మానం

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 17(అరుణ ప్రభ) కారుమూరి వెంకటరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లిలో మన అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మండపంలో కొలువుదీరిన శ్రీ వినాయక స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆశీస్సులు పొందారు. కారుమూరి వెంకటరెడ్డి మండపానికి చేరుకున్న సందర్భంగా మన అసోసియేషన్ సభ్యులు, నిర్వాహకులు, స్థానికులు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం మన అసోసియేషన్ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మన అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కారుమూరి వెంకటరెడ్డికి శ్రీ వినాయక స్వామివారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం లభించి, ప్రజాసేవలో మరింతగా ముందుకు సాగాలని అభిలషించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని వినాయక మండపం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. కార్యక్రమంలో మన అసోసియేషన్ సభ్యులు, నిర్వాహకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## మోదీ జన్మదిన వేడుకల్లో పచ్చదనం సందేశం

### సారపాకలో భాజపా ఆధ్వర్యంలో ఘనంగా మొక్కలు నాటిన నాయకలు

అరుణ ప్రభ సారపాక : భారత ప్రధానమంత్రి నరేంద్ర దామోదర్ దాస్ మోదీ 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో భాజపా ఆధ్వర్యంలో ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ పేరు మీద పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భావితరాలకు స్వచ్ఛమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని భాజపా నాయకులు పిలుపునిచ్చారు. పచ్చని చెట్లు ఆరోగ్యకరమైన సమాజానికి ఎంతో అవసరమని, పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని వారు కోరారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తూ పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## మల్కారం గ్రామ పంచాయతీలో ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ

### ప్రజా పాలన గ్రామ దినోత్సవం సందర్భంగా కార్యక్రమం

అరుణ ప్రభ -- శంషాబాద్ జోన్ : మల్కారం, సెప్టెంబర్ 17: తెలంగాణ ప్రజా పాలన గ్రామ దినోత్సవం సందర్భంగా మల్కారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ రోహిత్ కుమార్ తిరునగరి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొత్త రమాదేవి, గుండుమల్ల స్వాతి, కొత్త సంజీవరెడ్డి, ధారా శ్రీనివాస్, కారుకొండ రవి, పంచాయతీ కార్యదర్శి మజార్, కరోబార్ నరసింహ, వెటర్నరీ డాక్టర్ షఫీ ఉద్దీన్ పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు కొత్త దినేష్ రెడ్డి, గుండుమల్ల శ్రీకాంత్, అంగన్వాడీ టీచర్లు పద్మ, సునీత, ఆశా వర్కర్ అనూషతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాకు వందనం చేసి ప్రజా పాలన గ్రామ దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY



# ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహణ

### తెలంగాణ అభివృద్ధి, సంక్షేమమే ం

### ప్రజా ప్రభుత్వ లక్ష్యం : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరణ



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్ : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితె తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17, 1948న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో ప్రగతి ప్రణాళిక అమలు చేసి అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.390 కోట్లు మంజూరయ్యాయని, రోడ్డు విస్తరణ, ఆలయ విస్తరణ, అన్నదాన సత్రం, గుడిచెరువు పార్కు, బోటింగ్ తదితర పనులు కొనసాగుతున్నాయని వివరించారు. మహిళా సంఘాలకు రూ.187 కోట్ల బ్యాంకు రుణాలు, పింఛన్‌దారులకు నెలకు రూ.24.40 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు భారీగా ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చి వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లాలో 5.77 లక్షల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, 24,643 కొత్త రేషన్ కార్డులు, 1.95 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులు అందించినట్లు తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం కింద రూ.11.51 కోట్ల సబ్సిడీ జమ చేశామన్నారు. రైతు భరోసా కింద 1,27,884 మంది రైతులకు రూ.149.32 కోట్లు, 46,492 మంది రైతులకు రూ.370.75 కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 7,088 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 3,797 ఇళ్లు పూర్తయ్యాయని చెప్పారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్ ప్రయోజనాలు అందుతున్నాయని తెలిపారు. విద్యా రంగంలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్, ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆది శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించాలి

### మండపాల నిర్వాహకులతో సర్పంచ్ ఎలగందుల నర్సింహులు సమావేశం

### నిమజ్జనానికి క్రేన్ సౌకర్యం ఏర్పాటు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 17 (అరుణప్రభ): ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం గ్రామంలోని వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు, యువజన సంఘాల సభ్యులతో గ్రామ సర్పంచ్ ఎలగందుల నర్సింహులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ నిమజ్జన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై చర్చించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఈ నెల 23న గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పోలీసుల విధులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. అన్ని విగ్రహాల ఊరేగింపులో రెండు స్పీకర్ బాక్సులు మాత్రమే వినియోగించాలని తెలిపారు. గ్రామంలోని విద్యుత్ వైర్ల విషయంలో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, పెద్ద విగ్రహాల నిర్వాహకులు కొంత ఓపిక పాటిస్తూ చిన్న విగ్రహాల నిమజ్జనానికి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు. ప్రతి మండపం నిర్వాహకులు పరస్పరం సమన్వయంతో సమయపాలన పాటిస్తూ నిమజ్జన వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన క్రేన్ సౌకర్యాన్ని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

**ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి హామీ**

గ్రామంలోని యువజన సంఘాల సభ్యులు కోరిన మేరకు ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి త్వరలోనే చర్యలు చేపడతానని సర్పంచ్ ఎలగందుల నర్సింహులు హామీ ఇచ్చారు. విగ్రహ నిర్మాణానికి యువజన సంఘాలతో చర్చించి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో వివిధ యువజన సంఘాల నాయకులు, గణేష్ మండపాల నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.



## ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో ప్రజా పాలన దినోత్సవం.

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 17 (అరుణప్రభ). ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఓ. వెంకటేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో కలిసి ప్రజా పాలన దినోత్సవం ప్రాముఖ్యతను స్మరించుకున్నారు. ప్రజలకు పోలీసు శాఖ అందిస్తున్న సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎన్. రమేష్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): దేశాభివృద్ధి ధ్యేయంగా ప్రపంచంలోకెల్లా భారతదేశాన్ని మొదటి స్థానంలో ఉంచేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పనిచేస్తున్నారని గూడూరు పట్టణానికి చెందిన హీరోబెన్ మాతాజీ గ్లోబల్ ట్రస్ట్ నిర్వాహకులు కంకణాల పెంచలనాయుడు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా గూడూరు రెండో పట్టణ పరిధిలోని సంఘం థియేటర్ కూడలి వద్ద పాఠశాలలో హీరాబెన్ మాతాజీ గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ అందించారు. అనంతరం దుప్పట్లు ను అందచేశారు. ట్రస్ట్ నిర్వాహకులు పెంచల్ నాయుడు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎటువంటి సొంత లాభం చూసుకోకుండా దేశం ఎలా అభివృద్ధి చేయాలో నిరంతరం ఆలోచిస్తూ ప్రపంచంలో కెల్లా భారతదేశాన్ని నెంబర్ వన్ స్థానానికి తీసుకువెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు . ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వెంకట సుబ్బయ్య, గౌరి, నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుడి ఆర్థికసాయం



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్ : ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుడు ఏగదండి అంజయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబానికి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు లోకుర్తి బాలమల్లు అండగా నిలిచారు. అంజయ్య కుటుంబాన్ని పరామర్శించిన లోకుర్తి బాలమల్లు రూ.10 వేల నగదు ఆర్థిక సాయంతో పాటు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆపద సమయంలో మృతుడి కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన లోకుర్తి బాలమల్లు ఔదార్యాన్ని గ్రామస్థులు, పలువురు నాయకులు కొనియాడారు. పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు.



## మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ నాయకుల రక్తదానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 17 (అరుణప్రభ): భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపితో పాటు ఎల్లారెడ్డిపేటకు చెందిన బీజేపీ నాయకులు చందుపట్ల లక్ష్మారెడ్డి, సాయికిరణ్ నాయక్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు సాయికిరణ్ నాయక్, జిల్లా కౌన్సిలింగ్ సభ్యులు చందుపట్ల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోదీ వంటి కారణజన్ములు యుగానికి ఒక్కరే జన్మిస్తారని అన్నారు. దేశాన్ని, ధర్మాన్ని కాపాడుతూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న మోదీ ప్రజల గుండెల్లో ఎల్లకాలం నిలిచిపోతారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదానం చేయడం ద్వారా సామాజిక సేవలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని నాయకులు తెలిపారు.



## ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న సబ్‌సెంటర్ భవనాల పరిశీలన

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 17 (అరుణప్రభ): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కిషన్‌దాస్‌పేట్, ఎల్లారెడ్డిపేట సబ్‌సెంటర్ల నూతన భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ గురువారం ఆయా సబ్‌సెంటర్లను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌సెంటర్ భవనాల నిర్మాణ పనులతో పాటు విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు, మందులు, వైద్య పరికరాల లభ్యతను డీఎంహెచ్ఓ పరిశీలించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. సబ్‌సెంటర్ల ద్వారా గ్రామీణ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు మరింత చేరువయ్యేలా సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్య సేవలు, టీకాలు, రక్తహీనత పరీక్షలు, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్‌తో పాటు సీజనల్ వ్యాధుల నివారణ చర్యలను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. వేణుగోపాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎలగందుల నర్సింహులు, మెడికల్ ఆఫీసర్ డా. సారియా అంజుమ్, ఏఈ శ్రీనివాస్, కాంట్రాక్టర్ రాధారపు శంకర్, డీడీఎం-ఎన్‌హెచ్ఎం కార్తీక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## తహసీల్దార్ దివ్యజ్యోతిని సన్మానించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్ : ఎల్లారెడ్డిపేట మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన దివ్యజ్యోతిని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూడిది రాజేందర్ గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దివ్యజ్యోతికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత మెరుగ్గా అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపాలని కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేకూరి రాజేశం, సాహెబ్, బండారి బాల్‌రెడ్డి, మేడిపల్లి రవి, రాములు, రాజు, సురేందర్, ముద్దుల పద్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

### కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం

గజ్వేల్ అరుణ ప్రభ : గజ్వేల్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తెలంగాణ నిజాం పాలన నుంచి విముక్తి పొంది ప్రజా పాలన ప్రారంభమైన రోజుగా సెప్టెంబర్ 17ను గుర్తు చేసుకుంటున్నామని తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న పోలీస్ చర్య ద్వారా హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక పరిణామాలను విద్యార్థులకు వివరించారు. తెలంగాణ విముక్తి కోసం పోరాడిన దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ వంటి ఉద్యమ వీరుల త్యాగాలను స్మరించుకున్నారు. వారి పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మాట్లాడుతూ.. నిజాం పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, రజాకారుల దౌర్జన్యాలు, హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ

గజ్వేల్ అరుణ ప్రభ : తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాలిగామ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ తాళ్ల సునీత ఆంజనేయులు గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ప్రాధాన్యతను గుర్తు చేసుకుంటూ ప్రజల సంక్షేమం, గ్రామ అభివృద్ధి కోసం పాలకవర్గం, అధికారులు, గ్రామస్తులు సమిష్టిగా పనిచేయాలని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పారిశుద్ధ్యం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు పాలకవర్గం, గ్రామ పంచాయతీ సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మహమ్మద్ అజారుద్దీన్, ఉప సర్పంచ్ కొమురయ్య, పాలకవర్గ సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఐఎంఏ గజ్వేల్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం

గజ్వేల్ అరుణ ప్రభ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గజ్వేల్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ గజ్వేల్ శాఖ అధ్యక్షురాలు డా. పద్మజ్యోతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు డా. ఆకుల నరేశ్ బాబు, ఏఎంఎస్ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి డా. పెంటాచారి, సీనియర్ వైద్యులు డా. వాసవాచారి, తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. లింగం, ఐఎంఏ గజ్వేల్ శాఖ కార్యదర్శి డా. మంజుల, సహాధ్యక్షురాలు డా. శైలజ, కోశాధికారి డా. స్రవంతి పాల్గొన్నారు. అలాగే ఐఎంఏ సభ్యులు డా. సాయినాథ్ రెడ్డి, డా. నాగమునెయ్య, డా. శివకుమార్, శ్రీలత, ప్రవీణ్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో 8 వేల ఎకరాల భూ కబ్జా ఆరోపణలపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,సిరిసిల్ల శాసనసభ్యులు కౌంటర్

### ఆరోపణలకు పూర్తి ఆధారాలు బయటపెట్టాలి

### కొండూరు రవీందర్‌రావు, తోట ఆగయ్యలతో కలిసి కేటీఆర్ స్పందన







ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్ : సిరిసిల్ల జిల్లాలో 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని ధరణి పోర్టల్ ద్వారా వివిధ వ్యక్తులకు బదలాయించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ స్పందించారు. 8 వేల ఎకరాల భూ కబ్జాలకు సంబంధించి చిల్లర వ్యాఖ్యలు చేయడం కాకుండా పూర్తి ఆధారాలు, సర్వే నంబర్లు, భూములు ఎవరికి వెళ్లాయనే వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో 8 వేల ఎకరాల భూమి కబ్జా జరిగిందని ప్రభుత్వం చెబుతున్నట్లయితే అందుకు సంబంధించిన పూర్తి జాబితాను విడుదల చేయాలని కేటీఆర్ కోరారు. ఏ సర్వే నంబర్‌లో ఎంత భూమి ఉంది, ఎవరి పేరుపై బదలాయింపు జరిగింది, ఎవరు తప్పు చేశారనే వివరాలను ప్రజల ముందుంచాలని అన్నారు.

**2014 తర్వాత ఒక్క గజం భూమి కొనలేదు: రవీందర్‌రావు.**

తనపై వచ్చిన ఆరోపణలను న్యాఫ్స్‌కాబ్ చైర్మన్, టెస్కాబ్ మాజీ అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు ఖండించారు. 2014 తర్వాత తన పాస్‌బుక్‌లో ఒక్క గుంట భూమి కూడా పెరగలేదని, తాను ఒక్క గజం భూమి కూడా కొనుగోలు చేయలేదని పేర్కొన్నారు. తాను భూమి కొనుగోలు చేసినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని సవాల్ చేశారు. ఈ వ్యవహారంపై అవసరమైతే న్యాయపోరాటం చేస్తానని తెలిపారు.

**తోట ఆగయ్యకు ఇచ్చిన భూమిని లాక్కున్నారు: కేటీఆర్**

బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాజీ నక్సలైట్‌గా ప్రభుత్వానికి లొంగిపోయిన అనంతరం అప్పటి టీడీపీ ప్రభుత్వం పునరావాసంలో భాగంగా మూడున్నర ఎకరాల భూమిని కేటాయించిందని కేటీఆర్ తెలిపారు. ఆ భూమిని ప్రస్తుత ప్రభుత్వం తిరిగి తీసుకుందని ఆరోపించారు. తోట ఆగయ్య కూడా ఈ ఆరోపణలను ఖండిస్తూ, భూమి కేటాయింపు అప్పటి ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరిగిందని పేర్కొన్నారు.

**106 ఎకరాల భూమిని కాపాడాం**

భూపాలపల్లి ప్రాంతంలో 106 ఎకరాల భూమికి సంబంధించిన వ్యవహారంలో సుప్రీంకోర్టు వరకు వెళ్లి భూమిని కాపాడామని కేటీఆర్ పేర్కొన్నారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో ఈకో పార్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 8 వేల ఎకరాల భూమి బదలాయింపుపై ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉంటే వాటిని బహిర్గతం చేయాలని కేటీఆర్, కొండూరు రవీందర్‌రావు, తోట ఆగయ్య డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండిస్తూ, అవసరమైతే న్యాయపరంగా పోరాడుతామని స్పష్టం చేశారూ.



## విద్యార్థులకు స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంపై పోటీలు

అరుణప్రభ 17 సెప్టెంబర్ మహబూబాబాద్ : కురవి ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమము గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి అని కురవి గ్రామ సర్పంచ్ లక్ష్మి రాజు నాయక్ అన్నారు. వారు విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరము పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్యాల శ్రీధర్ అధ్యక్షతన జరిగిన స్వచ్ఛత పక్వాడ అవగాహన కార్యక్రమంలో వ్యాసరచన, వక్తృత్వ మరియు చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో రాజేశ్వర్ మరియు ఉపాధ్యాయులు శ్యామలాదేవి, దైద వెంకటేశ్వర్లు, గుండోజు నరసింహాచారి, బొందిలి వెంకన్న, బొంగాని మల్లికార్జున్ రావు, బేతమల్ల ప్రేమ సాగర్, బండి రవీందర్, భూక్యా బాలాజీ, తాళ్లపల్లి యాకమ్మ, యాకూబ్ అలీ, మల్లయ్య, శంకర్ మొదలగు వారు పాల్గొన్నారు.

# ఆరోగ్య మిత్ర సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ అభినందనీయం

### పోస్టర్ ఆవిష్కరణలో ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్



అరుణప్రభ 17 సెప్టెంబర్ మహబూబాబాద్ : ఆరోగ్యవంతమైన సమ సమాజ స్థాపన కై 2000 లో ప్రారంభించబడిన ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ అన్నారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రారంభించి 25 వసంతాలు అవుతున్న సందర్భంగా చేపట్టబోయే సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ సంబంధిత బ్రోచర్స్, కరపత్రాల ను గురువారం నాడు మానుకోట కలెక్టరేట్లో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ తో కలిసి ఆవిష్కరించి ఆవిష్కరించి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో గత 25 సంవత్సరాలుగా విద్యా, వైద్యం ఆరోగ్యం ఉ స్వావలంబన తదితర అంశాలపై నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సేవలు అభినందనీయమని తెలిపారు. ఈ రోజుల్లో ఆర్థిక వనరులు లేకపోయినా, మడమ తిప్పకుండా నిరంతరం సేవా కార్యక్రమాలు చేయడం డాక్టర్ అశోక్ పరికిపండ్ల అభినందనీయుడని అన్నారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ సాధారణ కార్యక్రమాలకు వినూత్నంగా 25 వసంతాలను పురస్కరించుకొని 25 జిల్లాల్లో కార్యక్రమాలు, 25 నెలలపాటు కార్యక్రమాలు, 25 రకాల కార్యక్రమాలు, 25 సంస్థలతో కలిసి పని చేస్తూ 25 మందికి అవార్డులు అందజేయనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ సిల్వర్ జూబ్లీ సందర్భంగా చేపట్టబోయే కార్యక్రమాల బ్రోచర్ ఉ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు బానోత్ రామ్ లాల్, నూకల అభినవరెడ్డి, కురవి టెంపుల్ చైర్మన్ రవీందర్ రెడ్డి, నూకల వేణుగోపాల్ రెడ్డి, ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాస్థాయి సైన్స్ సెమినార్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

### విజయవంతంగా జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

అరుణప్రభ 17 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : "ఇండియన్ ఎనర్జీ బాస్కెట్ – 2047: ప్రాస్పెక్ట్స్ అండ్ ఛాలెంజస్ " అనే అంశంపై మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ గురువారం విజయవంతంగా ముగిసింది. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాములు ప్రారంభించారు. జిల్లా సైన్స్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెమినార్‌లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 24 మంది విద్యార్థులు పాల్గొన్నారు. భారతదేశం 2047 నాటికి సాధించాల్సిన ఇంధన అవసరాలు, పునరుత్పాదక ఇంధన వనరులు, ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణ, సౌర మరియు పవన విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాలు తదితర అంశాలపై విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలు, శాస్త్రీయ అభిప్రాయాలను సమర్థవంతంగా వివరించారు.

**సెమినార్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల వివరాలు:** ప్రథమ స్థానం:ఎస్. దీక్షిత్ – టీజీఎమ్ ఎస్ , నెల్లికుదురు, ద్వితీయ స్థానం: కె. వైష్ణవి – శ్రీ వివేకవర్ధిని హైస్కూల్, కేసముద్రం, తృతీయ స్థానం: కె. రితేష్ – ఏకశిల ఏంజెల్స్ హైస్కూల్, మహబూబాబాద్, పి. సత్యకి – శ్రీ వివేకవర్ధిని హైస్కూల్, కేసముద్రం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం లో నిలిచిన విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సురేష్, నారాయణ, వీరన్నతో పాటు వివిధ పాఠశాలల గైడ్ టీచర్లు పాల్గొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ఆసక్తి, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడంలో సైన్స్ సెమినార్లు కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు

# ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

### జాతీయ జెండా ఆవిష్కరించిన

### ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్



అరుణప్రభ, మహబూబాబాద్ అర్బన్, సెప్టెంబర్ 17:లిలి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ స్నేహ శబరిష్, ఎస్పీ డాక్టర్ శబరిష్‌తో కలిసి ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆయన వివరాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. నారాయణపురం గ్రామంలో రీ–సర్వే పూర్తిచేసి 780 మంది రైతులకు 1,468.15 ఎకరాలకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశామని తెలిపారు. జిల్లాలో 70 గ్రామాలకు రీ–సర్వే ఆమోదం లభించగా, 11 గ్రామాల్లో సర్వే ప్రారంభమైందన్నారు. పరిశ్రమల రంగంలో 25 పరిశ్రమలకు రూ.42 కోట్ల పెట్టుబడులతో అనుమతులు మంజూరు చేసి 236 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. టీ–ప్రైడ్ కింద 79 యూనిట్లకు రూ.4 కోట్ల పెట్టుబడి రాయితీ ఇచ్చామన్నారు. విద్యారంగంలో రెండు పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా ఎంపిక చేసి మౌలిక వసతులు కల్పిస్తున్నామని, రెండు ప్రాంతాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పనులు ప్రారంభించామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాకు 10,651 ఇళ్లు కేటాయించగా, 99 రోజుల ప్రణాళికలో 3,685 ఇళ్ల లక్ష్యాన్ని పూర్తిచేశామని చెప్పారు. లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.234 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. రెండో దశలో నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున కేటాయించామని వెల్లడించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కొనసాగుతోందని, డిసెంబర్ 2023 నుంచి ఆగస్టు 2026 వరకు 4.72 కోట్ల మంది మహిళలు ప్రయాణించి రూ.244.73 కోట్లు ఆదా చేసుకున్నారని తెలిపారు. గృహజ్యోతి కింద 1,16,464 కుటుంబాలకు రూ.88.70 కోట్ల ప్రయోజనం అందిందన్నారు. రైతు భరోసా కింద 2,14,625 మంది రైతుల ఖాతాల్లో రూ.268 కోట్లు జమ చేశామని, రైతు బీమా కింద 770 మంది మృతిచెందిన రైతుల నామినీ ఖాతాల్లో రూ.38 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం కోసం 2,125 మంది రైతులకు శిక్షణ ఇచ్చామని, మిషన్ వైవిధ్యం ద్వారా తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచి, జిల్లాలో రూ.33.74 కోట్ల వ్యయంతో 11,097 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కొత్త ఆహార భద్రత కార్డులు, స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కూడా కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో బి.లావణ్య, అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, డీఆర్‌వో నాగలక్ష్మి, డీఆర్‌డీవో మధుసూదనరాజు, డీఏవో విజయచంద్రతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ కార్యాలయంలో రెపరెపలాడిన మువ్వెన్నల జెండా

అరుణప్రభ 17 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ మహబూబాబాద్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన జాతీయపతాకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీయంపి మాలోత్ కవిత, మాజీఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, బిఆర్ఎస్ నాయకులు పర్కాల శ్రీనివాస్ రెడ్డి, ముత్యం వెంకన్నగౌడ్, మార్నేని వెంకన్న, శ్రీరాంనాయక్, మహబూబ్ పాషా, బోడ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు

### భక్తిశ్రద్ధలతో

## 3వ రోజు పూజలు అందుకున్న విఘ్నేశ్వరుడు

### విఘ్నాలను తొలగించి సకల శుభాలను ప్రసాదించు బొజ్జ గణపయ్యా



అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి సంగారెడ్డి జిల్లా : సదాశివపేట పట్టణంలో: బుధవారం 16.9.2026 నాడు వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వర స్వామివారికి మూడో రోజు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పుష్పార్చనలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య గణనాథునికి విశేష పూజలు నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు భక్తి పారవశ్యంతో పూజల్లో పాల్గొన్నారు. విఘ్నేశ్వరుడు తమ జీవితాల్లోని విఘ్నాలను తొలగించి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం ప్రసాదించాలని భక్తులు ప్రార్థించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆహ్వాన బై ఎస్ ఫోర్ హోటల్

## ప్రారంభించిన టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి సంగారెడ్డి జిల్లా : సదాశివపేట మండలంలోని నంది కంది గ్రామ శివారులో రిలయన్స్ పెట్రోల్ పంపు పక్కన ఆహ్వాన బై ఎస్ ఫోర్ హోటల్‌ను టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ కస్టమర్లకు నాణ్యతగల రుచికరమైన ఆహారాన్ని ఇచ్చినట్లయితే వ్యాపారంలో అంచలంచలుగా ఎదగడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడిల రామ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధన్న, సదాశివపేట మండల అధ్యక్షుడు ఓగ్గు శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, నందికంది సర్పంచ్ స్రవంతి విజయభాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అంజమ్మ సత్యనారాయణ, నాయకులు చింటూ గౌడ్, నాగరాజు గౌడ్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## పల్లా సుధీర్ రెడ్డి దశదిన

## కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: దేవరకొండ మండలం పడ్మట్ పల్లి గ్రామానికి చెందిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ పల్లా నరసింహారెడ్డి గారి కుమారుడు పల్లా సుధీర్ రెడ్డి గారి దశదిన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలునాయక్ గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ గారు పల్లా సుధీర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, సుధీర్ రెడ్డి మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, ఈ విషాద సమయంలో వారి వెంట ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, మారుపాకుల సురేష్ గౌడ్, లోకసాని శ్రీధర్ రెడ్డి, దొండేటి మల్లారెడ్డి, ఆవిరినేని గోపాల్ రావు, దొంతినేని వెంకటేశ్వరరావు, జటావత్ హరినాయక్, కొర్ర రామ్ సింగ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## గణిత విభాగంలో
## ఉత్తమ ఉపాధ్యాయుడిగా బి.సుధాకర్‌శర్మకు సన్మానం
### మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో ఘనత

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్ : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోనీ రామాజీపేట ఎంపీయూపీఎస్ ప్రధానోపాధ్యాయులు బి. సుధాకర్ శర్మ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఇల్లంతకుంట మండల ఎంఆర్‌సీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు గణిత బోధనలో ఆయన చేస్తున్న కృషి, విద్యార్థుల విద్యాభివృద్ధికి అందిస్తున్న సేవలను గుర్తించి మండల స్థాయిలో ఈ గౌరవాన్ని అందించినట్లు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం పట్ల తోటి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సుధాకర్ శర్మకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి సి.హెచ్. శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా బి. సుధాకర్ శర్మను సన్మానించి అభినందించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు వారిలో ఆసక్తిని కలిగించేలా బోధన కొనసాగించాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయిని పావని, ఉపాధ్యాయులు తిరుపతి, బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము రమేష్తో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి. సుధాకర్ శర్మను అభినందిస్తూ ఆయన సేవలను కొనియాడారు.



## గణేశుడికి అత్యంత ప్రీతికరమైనది గరిక పూజ

అరుణప్రభ 17 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు ఉదయం సాయంత్రం వినాయకుడిని వివిధ రకాల పంచామృతాలతో పుష్పాలతో అతనికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించి కొలవడం ప్రతిదీ ఇందులో భాగంగా వినాయకుడికి అత్యంత ఇష్టమైనది గరిక పూజ అని అర్చకులు నిఖిల్ శర్మ అన్నారు మానుకోట జిల్లా కేంద్రంలోని స్థానిక నెహ్రూ సెంటర్లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బుధవారం రాత్రి భక్తుల కరచాలతో స్వామివారికి లక్ష గరిక పూజను జయదీప్యమానంగా నిర్వహించడం జరిగింది కార్యక్రమానంతరం హాజరైన భక్తులందరికీ వేద ఆశీర్వచనంతో పాటు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక 33 వ వార్డు కౌన్సిలర్ అజయ్ సారధి రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు కార్యక్రమంలో కమిటీ బాద్యులు భక్తులు పాల్గొన్నారు



## మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎస్పీ డా. శబరీష్

అరుణప్రభ 17 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి, జిల్లా ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలోనే కొనసాగిందని తెలిపారు. కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో చేపట్టిన ఆపరేషన్ పోలో అనంతరం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయిన చారిత్రక ఘట్టాన్ని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య పాలనలో ప్రజల సంక్షేమం, పారదర్శకత, జవాబుదారీతనం ఎంతో కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందేలా ప్రజాపాలన వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణ పోలీసుల ప్రధాన బాధ్యత అని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తడి నెలలు (వెట్ ల్యాండ్) పరిరక్షణ, నిర్వహణకు పకడ్బందీ చర్యలు

### జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో
### సమీక్ష సమావేశం నిర్వహించిన :: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



అరుణప్రభ 17 సెప్టెంబర్ మహబూబాబాద్ : జిల్లాలోని చిత్తడి నేలలు (వెట్‌ల్యాండ్స్), చెరువులు, ఇతర జలాశయాల పరిరక్షణ, సమర్థవంతమైన నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'జిల్లా స్థాయి చిత్తడి నేలల పరిరక్షణ కమిటీ' సమీక్ష సమావేశంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ...పరిరక్షణ, సర్వే: జిల్లా పరిధిలోని గుర్తించిన చిత్తడి నేలల సరిహద్దులను వెంటనే స్పష్టంగా సర్వే చేసి, ఆక్రమణలకు గురికాకుండా కంచెలు (ఫెన్సింగ్) మరియు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. జీవవైవిధ్యం కాపాడటం: పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో, భూగర్భ జలాలు పెరగడంలో పక్షులు/జీవుల ఉనికికి చిత్తడి నేలలు ఎంతో కీలకమైనవని, వాటి ప్రాముఖ్యతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అవగాహన కార్యక్రమాలు: చిత్తడి నేలల ప్రాముఖ్యతపై స్థానిక ప్రజలు, విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రెవెన్యూ, అటవీ, నీటిపారుదల మరియు పర్యావరణ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శాఖల సమన్వయం: ప్రతి శాఖ తమ పరిధిలోని సమాచారాన్ని క్రమం తప్పకుండా జిల్లా కమిటీకి అందించాలని, సంయుక్త తనిఖీలు చేపట్టాలని సూచించారు ఈ వెట్ ల్యాండ్ పరిరక్షణ నిర్వహణకు జిల్లా స్థాయి కమిటీ చైర్మెన్ గా జిల్లా కలెక్టర్, జిల్లా అటవీ శాఖ అధికారి మెంబర్,కన్వీనర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ, జడ్పీ సీఈవో, డిఆర్డిఓ, ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా మాత్య శాఖ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా ఉద్యాన అధికారి, ఎస్ఈ ఇరిగేషన్, ఈఈ కాలుష్య నియంత్రణ అధికారి, ఏడి ల్యాండ్ రికార్డ్స్ అధికారి, డిడి గ్రౌండ్ వాటర్, జిల్లాలోనీ (5) మున్సిపల్ కమిషనర్లు, సభ్యులు గా మొత్తం (19) మంది పనిచేస్తున్నారని, జిల్లాలోని ఆకేరు, తదితర ట్యాంక్లు, చెరువులు,కుంటలు , కెనాల్స్, లతో పాటు వెట్ ల్యాండ్ పరిరక్షణ పరిధిలోకి వచ్చే సుమారు (493) ట్యాంక్స్ ను పరిరక్షించి పర్యావరణం కలుషితం కాకుండా అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని కలెక్టర్ తెలిపారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, ఐబి ఎస్ఈ రామకృష్ణ, ఈఈ రవి కుమార్, ఎఫ్డిఓ వెంకటేశ్వర్లు, ఏడి సర్వే ల్యాండ్ శ్రీనివాసులు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, అన్ని విభాగాల సంబంధిత అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు దామోదర్, తదితరులు పాల్గొన్నారు



## వికసిత భారత్ ల
## క్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
### ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్. : ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి మాట్లాడుతూ వికసిత భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోందని, ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడు తనవంతు బాధ్యతగా భాగస్వామి కావాలని సూచించారు. అప్పుడే ప్రజలకు మెరుగైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, ఆదాయం, భద్రత, సమాన అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, సాంకేతికంగా, పర్యావరణ పరంగా బలమైన దేశంగా భారత్ ఎదగాలంటే ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వం కోసం జరిగిన ఉద్యమంలో ఎంతోమంది త్యాగాలు చేశారని, వారి త్యాగాలను ఎప్పటికీ మరిచిపోకూడదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వాసరవేణి పరశురాములు, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణు ప్రసాద్, జ్యాతోతు శ్రీనివాస్, గజ్జెల గంగాధర్, అనుముల రవిచంద్ర, అగోలం గౌతమీ, బోధనేతర సిబ్బంది విమల్ కుమార్, కనిమేని దేవేందర్, షాహినా సుల్తానా, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్



అరుణప్రభ 17 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ మరియు మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ ఆదేశాల మేరకు తెలంగాణ విమోచన దినోత్సవం ప్రజా పాలన విజయోత్సవం సందర్భంగా మండల అధ్యక్షులు పట్టణ కాంగ్రెస్ పార్టీ పలు వార్డుల కౌన్సిలర్లతో కలిసి జెండా ఆవిష్కరణ చేసిన మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17వ తేదీకి ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. రాచరిక పాలన నుంచి ప్రజా పాలన వైపు తెలంగాణ పయనించిన చారిత్రక సందర్భాన్ని స్మరించుకుంటూ ఈ రోజును ప్రజా పాలన విజయోత్సవంగా జరుపుకుంటున్నాం తరతరాలుగా కొనసాగిన వెట్టి చాకిరి, దోపిడీ, పెత్తందారీ వ్యవస్థలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటాలు, త్యాగాలు మన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రజలు చేసిన ఉద్యమాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం అన్నారు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, సంక్షేమం, అభివృద్ధి అందించడమే ప్రజా పాలన లక్ష్యంగా ముందుకు సాగాలి. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములై ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఆకాంక్షిద్దాం. తెలంగాణ విమోచన దినోత్సవం ప్రజా పాలన విజయోత్సవం సందర్భంగా తెలంగాణ మరింత అభివృద్ధి, సంక్షేమం, శాంతి, సౌభ్రాతృత్వంతో ముందుకు సాగాలని కోరుకుందాం. ఈ యొక్క కార్యక్రమంలో మహబూబాబాద్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, అజ్మీర సురేష్ నాయక్ కాంగ్రెస్ పార్టీ పలు వార్డుల కౌన్సిలర్లు, నీరుటి లక్ష్మీనారాయణ,బొల్లు రాజు, మహమ్మద్ ఖలీల్, సాల్వాయి దిలీప్, పద్మం ప్రవీణ్, గాడిపెల్లి చరణ్, అంబాల శివకుమార్, బానోతు భాస్కర్, పుచ్చకాయల సరిత, చిదిరాల అరుణ జ్ఞానేశ్వర్, నిమ్మల శ్రీనివాస్, గోపీనాథ్, ,ఎస్టీ ఎడ్ల రమేష్ హరి సింగ్ ఎన్ఎస్ఇవై జిల్లా అధ్యక్షులు బెల్లం చంటి, శేఖర్, బేతల్ నాయకులు కాజా పాష, యూత్ కాంగ్రెస్ నాయకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు మహిళా మణులు తదితరులు పాల్గొన్నారు



## ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం జరుపుకోవాలి
### ::: ఎల్లారెడ్డిపేట ఎస్సై రమేష్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 17: అరుణప్రభ న్యూస్ : ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన వేడుకలను నిర్వహించుకోవాలని ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్. రమేష్ యూత్ సభ్యులకు సూచించారు. మండల కేంద్రంలో పవర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎస్సై రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ గణేష్ విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. నిమజ్జన సమయంలో పూర్తిస్థాయిలో డీజేలు వినియోగించకుండా పోలీసుల సూచనలను పాటించాలని యూత్ సభ్యులను కోరారు. పవర్ యూత్ 21వ వార్షికోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది జంటలు కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్‌తో పాటు సర్పంచ్ నర్సింలు, ఉప సర్పంచ్ బందారపు బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్, వార్డు సభ్యుడు గంట బాలకృష్ణ గౌడ్, పవర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీ రిజర్వేషన్లను 6% నుంచి 10%కి పెంచిన ఘనత కేసిఆర్‌దే

### 3,146 తండాలను
### నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు



అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండల కేంద్రం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటూ తండా గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలకు కృతజ్ఞతగా టీఎస్‌కే తండా మాజీ సర్పంచ్ బాలు నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పసునూరి నవీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకమైనవని పేర్కొన్నారు. తండాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడం ద్వారా గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక గుర్తింపు, స్థానిక పాలనలో భాగస్వామ్యం పెరిగిందని తెలిపారు. తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడమే కాకుండా, తండాలకు బీటీ రోడ్ల నిర్మాణం, గ్రామ పంచాయతీ భవనాల ఏర్పాటు, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి కూడా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని నవీన్ తెలిపారు.గ్రామ పంచాయతీలుగా మారిన తండాల్లో మౌలిక వసతులు అభివృద్ధి చెందడంతో స్థానిక ప్రజలకు పాలన మరింత చేరువైందని, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఈ చర్యలు దోహదపడ్డాయని పేర్కొన్నారు.అలాగే ఎస్టీ రిజర్వేషన్లను 6% నుంచి 10%కి పెంచడం గిరిజనుల అభివృద్ధి కోసం తీసుకున్న ముఖ్యమైన నిర్ణయమని అన్నారు.పాలకుర్తి మండలంలో గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా సంత్ సేవాలాల్ భవన్ నిర్మాణం కోసం ఒక ఎకరం స్థలం, ?2 కోట్ల నిధులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రత్యేక కృషితో మంజూరు చేయించడం జరిగిందని నవీన్ తెలిపారు.గిరిజనుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక అభివృద్ధికి ఉపయోగపడే విధంగా సంత్ సేవాలాల్ భవన్ నిర్మాణానికి తీసుకున్న ఈ చర్య గిరిజన సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, ఉప సర్పంచ్ భూక్య దూలమ్మ, ధరావత్ కమలమ్మ, విజయ పద్మ, జీజ భూక్య, కలమా సక్రి, మధు, ఆలూ, ధారావత్ సుధాకర్, రమేష్, బాలూ, శ్రీను, భాస్కర్, వెంకన్న తదితరులు.

# ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్న ప్రభుత్వం

## తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 17:లిలి తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా ఘనంగా నిర్వహిస్తోందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో గురువారం జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేందుకు అప్పట్లో ప్రజా సంఘాలు ఉద్యమాలు, సభలు, సమావేశాలు నిర్వహించాయని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా రైతాంగం సైతం పోరాటం చేసిందన్నారు. చర్చల ద్వారా సమస్య పరిష్కారం కాకపోవడంతో 1948 సెప్టెంబర్ 13న ఆపరేషన్ పోలో ప్రారంభమై, భారత సైన్యం హైదరాబాద్ సంస్థానంలోకి ప్రవేశించిందని చెప్పారు. అనంతరం నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోవడంతో సెప్టెంబర్ 17 చారిత్రక ప్రాధాన్యం సంతరించుకుందని పేర్కొన్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం భారతదేశంలో విలీనమై ప్రజాస్వామ్య పాలనకు మార్గం ఏర్పడినట్లు అధికారిక చరిత్రలోనూ పేర్కొంటున్నారు. ఈ చారిత్రక పరిణామం వెనుక ఎంతోమంది చేసిన త్యాగాలు, పోరాటాలు ఉన్నాయని శ్రీనివాస్‌రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసం జరిగిన పోరాటంలో వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారని అన్నారు. ఈ రోజును రాజకీయ, మతపరమైన విభేదాలకు కారణంగా కాకుండా ప్రజాస్వామ్య పాలనకు మార్గం సుగమం చేసిన చారిత్రక సందర్భంగా గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించడం స్వాగతించదగిన పరిణామమన్నారు. ప్రజా ప్రభుత్వంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ప్రజాపాలన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న విషయం రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనల్లోనూ స్పష్టమవుతోంది. హైదరాబాద్ భవిష్యత్ అభివృద్ధిలో భాగంగా ఫ్యూచర్ సిటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, క్రీడలు, ఔషధ పరిశ్రమ, సమాచార సాంకేతిక రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమని అన్నారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, మేనేజర్ శైలేశ్వర్‌రెడ్డి, అకాడమీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గణనాథుడి నిమజ్జనం

## కన్నుల పండువగా శ్రీ సిద్ధి వినాయకుని ఊరేగింపు.. వెయ్యి మందికి పైగా అన్నదానం

అరుణ ప్రభ:– సారపాక గురువారం: సారపాక సుందరయ్య కాలనీలో పోట్రు ఏసుబాబు ఆధ్వర్యంలో మూడు రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం సాయంత్రం శ్రీ సిద్ధి వినాయకుని నిమజ్జనోత్సవాన్ని భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీ సిద్ధి వినాయక విగ్రహాన్ని భక్తుల జయజయధ్వానాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. డీజే సంగీతానికి యువత ఉత్సాహంగా నృత్యాలు చేయగా, మహిళలు, చిన్నారులు, పెద్దలు సైతం పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందోత్సాహాలతో సందడి చేశారు. గణనాథుని నామస్మరణలు, భక్తుల జయజయధ్వానాలతో సుందరయ్య కాలనీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని పోట్రు ఏసుబాబు ఆధ్వర్యంలో వెయ్యి మందికి పైగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అందించి సేవాభావాన్ని చాటుకున్నారు.



మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో సాగిన శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు నిమజ్జనంతో ముగిశాయి. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన పోట్రు ఏసుబాబు, ఉత్సవ కమిటీ సభ్యులను సుందరయ్య కాలనీ వాసులు అభినందించారు.

## భక్తిశ్రద్ధలతో 4వ రోజు పూజలు అందుకున్న విఘ్నేశ్వరుడు

### విఘ్నాలను తొలగించి సకల శుభాలను ప్రసాదించు బొజ్జ గణపయ్యా



అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి సంగారెడ్డి జిల్లా : సదాశివపేట పట్టణంలో: గురువారం 17.9.2026 నాడు వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వర స్వామివారికి 4వరోజు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పుష్పార్చనలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గణనాథునికి విశేష పూజలు నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు భక్తి పారవశ్యంతో పూజల్లో పాల్గొన్నారు. విఘ్నేశ్వరుడు తమ జీవితాల్లోని విఘ్నాలను తొలగించి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం ప్రసాదించాలని భక్తులు ప్రార్థించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని

# బీజేపీ నాయకుల ప్రత్యేక పూజలు

అరుణప్రభ 17 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : భారత ప్రధాని నరేంద్ర మోడీ 76వ జన్మదినమును పురస్కరించుకొని మానుకోట బిజెపి జిల్లా శాఖ అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నెహ్రూ సెంటర్లోని స్థానిక గణనాధుడికి ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు ఈ సందర్భంగా అర్చకులు నిఖిల్ శర్మ ప్రధానమంత్రి ఆయురారోగ్యాలతో రాజకీయ అభివృద్ధికై శత్రు నివారణకై ప్రత్యేక పూజలు చేయడం జరిగింది కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బావి భారత ప్రధాని నరేంద్ర మోడీ 12 సంవత్సరాల 6 నెలలు గుజరాత్ ముఖ్యమంత్రిగా 12న సంవత్సరాలుగా ప్రధానమంత్రిగా కొనసాగుతున్న విషయం తెలిసిందే ఈ సందర్భంగా అతను జన్మదిన సందర్భంగా ఆదిదేవుడైన తొలి పూజలు అందుకునే గణనాథుని ఆశీస్సులు దేశ ప్రధాని పైన సమృద్ధిగా ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్లు ఆయన తెలిపారు కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు బిజెపి నాయకులు నరేంద్ర మోడీ అభిమానులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# కొర్ర నిర్యా మృతి బాధాకరం

## బీఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్

డిండి మండలం కటిక బండ తండాకి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కొర్ర నిర్యా ఈ రోజు మృతి చెందారు వారి కుటుంబ సభ్యులకు పరామర్శించిన బీఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ గారు ఆయన వెంట సర్పంచ్ బాధ్య నాయక్, అరుణ్, విజయ్ తదితరులు ఉన్నారు.



# 60 ఏళ్ల నిరీక్షణకు తెర..

# లక్ష్మీనగర్ పేదల సొంతింటి కల సాకారం

## అపార్ట్‌మెంట్ తరహా ఇళ్ల నిర్మాణం

## చారిత్రాత్మకం: ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం: అరుణ ప్రభ 35వ వార్డు వెలంపేట లక్ష్మీనగర్ ప్రాంత ప్రజల దశాబ్దాల నివాస సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికుల్లో ఆనందం వెల్లివిరిసింది. సుమారు 60 ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పేదలకు అపార్ట్‌మెంట్ తరహాలో పక్కా ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టడం చారిత్రాత్మకమని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే, జనసేన నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు.

ఈ సందర్భంగా లక్ష్మీనగర్ ప్రజలతో కలిసి ఎమ్మెల్యే వెలంపేట నుంచి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం వరకు పాదయాత్ర నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పాదయాత్రలో స్థానికులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు ఆయనను సత్కరించారు. మహిళలు, స్థానికులు పూలవర్షం కురిపిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లక్ష్మీనగర్ ప్రజలు ఆరు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న నివాస సమస్యకు పరిష్కారం లభించడం సంతోషకరమన్నారు. పేదలకు గౌరవప్రదమైన నివాసాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, మంత్రి పొంగూరు నారాయణల సహకారంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. లక్ష్మీనగర్ సమస్యకు పరిష్కారం లభించడంపై స్థానికులు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీనగర్ సేవా సంఘం ప్రతినిధి పిల్లి రమణ, కూటమి వార్డు అధ్యక్షులు రాము రెడ్డి, త్రినాథ్, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎల్లారెడ్డిపేటలో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 18 (అరుణప్రభ ప్రతినిధి): ఎల్లారెడ్డిపేట పట్టణంలోని ఓం గాయత్రి స్వర్ణకార సంఘ భవనంలో విశ్వకర్మ భగవానుడి జయంతి వేడుకలను స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గాద అశోక్ చారి ఆధ్వర్యంలో విశ్వకర్మ భగవానుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవానుడిని స్మరించుకుంటూ సభ్యులు భక్తిశ్రద్ధలతో జయంతి వేడుకలు నిర్వహించారు. స్వర్ణకార సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు పాలోజి సతీష్, ప్రధాన కార్యదర్శి శ్రీరామోజి ప్రవీణ్, కోశాధికారి పాలోజి సంతోష్, గౌరవ సభ్యులు గాద రమేష్, గాద ధర్మచారి, శ్రీరామోజి సత్యనారాయణ, చిన్నోజు పురుషోత్తం, మరిపెల్లి వేణు, గాద కిషన్, గాద సంతోష్, శ్రీరామోజి శేఖర్, శ్రీరామోజి శ్రీనివాస్, ఎర్రవెల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల ఆరాధ్య దైవం కేసీఆర్

### మాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్

అరుణప్రభ 17 సెప్టెంబర్ మహబూబాబాద్ : గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన చారిత్రక నిర్ణయానికి కృతజ్ఞతగా మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పెద్దతండా గ్రామంలో లిమాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ శ్రీమతి సత్యవతి రాథోడ్ ఆధ్వర్యంలోలి భారీ ఎత్తున కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా లిబీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చిత్రపటానికి సత్యవతి రాథోడ్ గారు పాలాభిషేకం నిర్వహించారులి అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. సందర్భంగా లిసత్యవతి రాథోడ్ మాట్లాడుతూ... "గిరిజనుల ఆరాధ్య దైవం మాజీ సీఎం కేసీఆర్ గారులి గిరిజనుల ఆత్మగౌరవం కోసం ఆత్మగౌరవ భవనాలను నిర్మించడంతో పాటు, గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచడం, గిరిజన బంధు, పోడు భూములకు హక్కులు కల్పించడం వంటి నిర్ణయాలు చారిత్రాత్మక ఘట్టాలు అన్నారు రాష్ట్రంలో సుమారు 45 లక్షల మంది గిరిజనులు ఉన్నారు, గిరిజనుల జీవితాల్లో సెప్టెంబర్ 17 ఒక మైలురాయిగా నిలిచింది, రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచడంతో గిరిజన విద్యార్థులు, నిరుద్యోగ యువతకు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో మరింత ప్రయోజనం కలిగింది. లివిద్య ద్వారానే వికాసం సాధ్యమని నమ్మిన కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా గిరిజన గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందించారులి గిరిజన బిడ్డల భవిష్యత్తుకు బలమైన పునాది వేశారు దశాబ్దాలుగా పాలించిన ప్రభుత్వాల పాలన ఒక ఎత్తయితే, కేసీఆర్ గారి పాలన మరో ఎత్తు. గత పాలనల్లో గిరిజన ప్రాంతాల్లో కనీస వసతులు కూడా సరిగా కల్పించిన దాఖలాలు లేవు. తాగునీటి కోసం గిరిజన మహిళలు కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితులు ఉండేవి.కేసీఆర్ గారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో 3,416 తండాలు గ్రామపంచాయతీలుగా మారాయి. గిరిజన బిడ్డలే స్థానిక పాలకులుగా ఎన్నికై తమ తండాల అభివృద్ధిలో భాగస్వాములయ్యారు. గిరిజనుల పట్ల కేంద్ర ప్రభుత్వానికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి, గిరిజనుల ఆత్మగౌరవానికి తగిన గుర్తింపు ఇవ్వాలి. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ తెలంగాణ అభివృద్ధికి ఏం చేసిందో ప్రజలకు వివరించాలి, కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందిలికాంగ్రెస్, బీజేపీలు ఎన్ని రాజకీయ కుట్రలు చేసినా బీఆర్ఎస్‌ను ప్రజల నుంచి దూరం చేయలేరు, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని సత్యవతి రాథోడ్ అన్నారు గిరిజనుల సంక్షేమం, ఆత్మగౌరవం, హక్కుల కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు ఈ మహత్తర కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కుమారి బిందు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూగులోతు శ్రీరామ్ నాయక్ అయిలీ నరహరి గౌడ్ బోడ శ్రీను నాయక్ బాధే నాగన్న మాన్య పాట్ని. మల్చూరు. నరేష్ సీతారాం నాయక్ ప్రకాష్. శ్రీరామ్ కోటేష్. బద్రు. బిఆర్ఎస్ కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు



## డబ్బు సంపాదించే ఏకైక మార్గం

### బ్యాలా ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్, : సిఎండి తేప్పలి సైదులు

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండల కేంద్రం ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించి, ప్రతి లబ్దిదారున్ని ఆర్థిక చేయూతను అందిస్తూ ప్రోత్సహించడానికి బ్యాలా ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కృషి చేస్తుందని లిమిటెడ్ సీఎండి తెప్పలి సైదులు తెలిపారు.మండల కేంద్రంలోని మాంగల్య గార్డెన్ లో గురువారం నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు.బ్యాలా ట్రేడర్స్ ప్రయివేట్ లిమిటెడ్ ద్వారా ప్రజలకు ఆరు రకాల వస్తువులను అందిస్తున్నామని తెలిపారు. హెర్బల్, కిరాణం, దుస్తులు, హోం నీడ్స్, సిల్వర్, బంగారం అందిస్తున్నామన్నారు. ఆరు రకాల వస్తువుల్లో ప్రతి వస్తువు ప్రతి కుటుంబంలో అవసరం ఉంటుందని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వస్తువు తయారు చేసే కంపెనీ ప్రధాన డీలర్ నుంచి బ్యాలా ట్రేడర్స్ ప్రయివేట్ లిమిటెడ్ వస్తువులను కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు.వస్తువు తయారు చేసే కంపెనీ నుండి వస్తువును నేరుగా కొనుగోలు చేయడంతో ప్రతి వస్తువుపై 20 నుంచి 50శాతం లిమిటెడు నికర ఆదాయం వస్తుందని వివరించారు. వచ్చిన ఆదాయంలో బ్యాలా ట్రేడర్స్ ప్రయివేట్ లిమిటెడ్ లో రూ.7 వేలు చెల్లించి వస్తువు కొనుగోలు చేసే లబ్ధిదారునికి ఐడిని కేటాయిస్తామని తెలిపారు. రూ.7 వేలు చెల్లించి వస్తువు కొనుగోలు చేసిన లబ్ధిదారునికి నెలకు రూ.500 చొప్పున రివార్డు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నామని వివరించారు. 12 నెలల్లో 6 వేలు రివార్డు అందుతుందని వస్తువు కొనుగోలు విలువ వెయ్యి రూపాయలు మాత్రమే ఉంటుందని వివరించారు. సిల్వర్, బంగారంలపై రూ.7 వేలు విలువచేసే వెండి, బంగారాన్ని అందించి 12 నెలలు నెలకు 500 మొత్తం 6 వేలు రివార్డు ప్రోత్సాహకాన్ని అందిస్తామన్నారు. వస్తువు తయారీ కంపెనీ నుంచి లిమిటెడ్ కు 50 శాతం వచ్చే ఆదాయంలో లబ్దిదారులకు 25 శాతం కేటాయిస్తామని తెలిపారు. ప్రతి వస్తువులోనూ లబ్దిదారులకు లబ్దిచ్చేకూర్చేలా కృషి చేస్తున్నామన్నారు. లిమిటెడ్ లో రూ.50 వేల విలువచేసే టీవీని కొనుగోలు చేసిన లబ్దిదారులకు నెలకు రూ.3500 నగదు రివార్డును 12 నెలలుగా అందిస్తామని వివరించారు. ప్రైవేట్ లిమిటెడ్ అందించే వస్తువులలో గృహ అవసరాలకు ఉపయోగపడే అన్ని వస్తువులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గత ఐదు సంవత్సరాలుగా పాలకుర్తి కేంద్రంగా బ్యాలా ట్రేడర్స్ (ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సీలింగ్ బిజినెస్తో ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రజలు డైరెక్ట్ సెల్లింగ్ బిజినెస్ మా ప్రయివేట్ లిమిటెడ్ ద్వారా చేసుకోవచ్చునని స్పష్టం చేశారు. ప్రయివేట్ లిమిటెడ్ లో 139 మంది సేల్స్ మెన్స్ గా పనిచేస్తూ 3,000 మంది కస్టమర్లు ఉన్నారని వివరించారు. ఎలాంటి మోసాలు లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల ఆర్థిక స్వాలంబన కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కస్టమర్లు, ఏజెంట్లు సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.



# ప్రశాంతంగా ముగిసిన గణపతి నిమజ్జనం

ధర్మవరం, సెప్టెంబరు 17; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణంలో గురువారం గణపతి నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ప్రశాంతంగా ముగిసింది. వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన గణేశ విగ్రహాలను భక్తులు ఊరేగింపుగా తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు గత రెండేళ్లుగా నిమజ్జనానికి ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు తెలిపారు. చెరువు వద్ద రెండు భారీ క్రేన్లు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పోలీసు, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్ తదితర శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగియడంపై హరీష్ బాబు సంతోషం వ్యక్తం చేసి, సహకరించిన భక్తులు, ప్రజలు, అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ధర్మవరం, సెప్టెంబరు 17; (అరుణ ప్రభ న్యూస్) : ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచనల మేరకు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు గురువారం ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. గుట్టకిందపల్లిలోని బీసీ బాలుర వసతి గృహంలో ఇంటర్, డిప్లొమా విద్యార్థులకు, దుర్గా నగర్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ మోదీ జన్మదినాన్ని వేడుకలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించాలన్నదే మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచన అని తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు జింక చంద్ర, కుంచపు నారప్ప, వేణు, అక్కులప్ప, వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.





## పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా వివాహ వార్షికోత్సవ వేడుకలు

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఆకుల లక్ష్మీ నాగరాజు ల వివాహ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి ఆకుల నాగరాజు దంపతులకు హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మార్కెట్ చైర్మన్ లావుడియా మంజుల భాస్కర్, కమ్మగానీ నాగయ్య గౌడ్, వీరమనేని యాకాంతరావు, జలగం కుమార్,చిలువేరు కృష్ణమూర్తి, పెనుగొండ రమేష్, మారం శ్రీను,పన్నీరు వెంకన్న, కామారపు సునీల్, ఎండి యాకూబ్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వేడుకలను నిర్వహించారు.

## రూ.41 వేలకు వినాయక లడ్డూ వేలం

ధర్మవరం, సెప్టెంబరు 17; (అరుణ ప్రభ న్యూస్) : పట్టణంలోని మారుతి రాఘవేంద్రస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు నిర్వహించిన లడ్డూ వేలంలో మాజీ టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు చట్టా లక్ష్మీనారాయణ స్వామి రూ.41 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూ దక్కడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ముగించారు.



## ఆస్ట్రేలియాలో ఘోర రోడ్డు ప్రమాదం.. విశాఖకు చెందిన ఇద్దరు మహిళలు మృతి

**మృతులు వీడీసీఏ మాజీ అధికారి జీటీ ప్రసాద్ భార్య, కోడలు**
**కుటుంబ వేడుక కోసం ఆస్ట్రేలియా వెళ్లగా మెల్బోర్న్‌లో ఘటన**
**కళ్లెదుటే ప్రమాదం జరగడంతో తీవ్ర దిగ్భ్రాంతిలో జీటీ ప్రసాద్**
**పది రోజుల్లో మృతదేహాలు విశాఖకు చేరుకునే అవకాశం**

విశాఖపట్నానికి చెందిన ఒకే కుటుంబంలోని ఇద్దరు మహిళలు ఆస్ట్రేలియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. మెల్బోర్న్ నగరంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన విశాఖలో తీవ్ర విషాదఛాయలు నింపింది. విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (వీడీసీఏ) మాజీ సంయుక్త కార్యదర్శి జీటీ ప్రసాద్ ఇటీవల తన భార్యతో కలిసి ఆస్ట్రేలియా వెళ్లారు. అక్కడ జరుగుతున్న ఒక కుటుంబ వేడుకలో పాల్గొనేందుకు వారు మెల్బోర్న్ చేరుకున్నారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో జీటీ ప్రసాద్ భార్యతో పాటు ఆయన కోడలు నేహా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. అత్యంత విషాదకరమైన విషయమేమిటంటే, ఈ ప్రమాదం జీటీ ప్రసాద్ కళ్లెదుటే జరిగింది. ఈ ఘటనతో ఆయన తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వేడుక కోసం ఎంతో ఆనందంగా వెళ్లిన ఆ కుటుంబంలో ఈ ప్రమాదం తీరని శోకాన్ని మిగిల్చింది.

## విశ్వకర్మ పథకంతో చేతివృత్తులకు భరోసా



ధర్మవరం, సెప్టెంబరు 17; (అరుణ ప్రభ న్యూస్) : చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు పీఎం విశ్వకర్మ పథకం దోహదపడుతుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింక చంద్రశేఖర్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ వృత్తిదారులకు నైపుణ్య శిక్షణ, ఆధునిక పనిముట్లకు ప్రోత్సాహం, మార్కెటింగ్ సహాయం, రాయితీ వడ్డీతో రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన కళాకారులకు రెండు విడతల్లో రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. సంప్రదాయ వృత్తులను పరిరక్షించడంతో పాటు ఆధునిక మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



## విశ్వకర్మ చేతివృత్తిదారులకు ఆదర్శం

ధర్మవరం, సెప్టెంబరు 17; (అరుణ ప్రభ న్యూస్) : భగవాన్ విశ్వకర్మ విశ్వానికి తొలి శిల్పి అని ఆర్డీఓ రామభూపాల్‌రెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ కార్యాలయంలో విశ్వ కర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి ఆర్డీఓతో పాటు అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్డీఓ మాట్లాడుతూ దేవ తలకు అవసరమైన దివ్య ఆయుధాలను సమకూర్చిన మహనీయుడు విశ్వకర్మ అని పేర్కొన్నారు. నేటి శిల్పులు, చేతివృత్తిదారులకు ఆయన ఆదర్శమూర్తి అన్నారు. కంసాలి తదితర విశ్వకర్మ వృత్తిదారులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సేవలందిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్ప డుతున్నారని కొనియాడారు. ఏఓ ఖతీజూన్ కుప్రా, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన దినోత్సవం ప్రాధాన్యతను గుర్తు చేసుకుంటూ ప్రజాస్వామ్య విలువలు, ప్రజా సేవ పట్ల బాధ్యతను పాటించాల్సిన అవసరాన్ని అధికారులు, సిబ్బంది గుర్తు చేసుకున్నారు. ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది జాతీయ సమైక్యత, ప్రజాసేవ పట్ల తమ బాధ్యతను పునరుద్ఘాటించారు.




## కూటమి ప్రభుత్వం వచ్చాకే రాష్ట్ర అభివృద్ధి

**వైసీపీ తప్పుడు ప్రచారం మానుకోవాలి..ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్**

విశాఖపట్నం, అరుణ ప్రభ సెప్టెంబరు 17: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం, వెలుగొండ, భోగాపురం విమానాశ్రయం, బీచ్ కారిడార్ వంటి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని జనసేన నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గురువారం సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని విమర్శించారు. 151 స్థానాల నుంచి 11 స్థానాలకు పడిపోయిన పరిస్థితిపై వైసీపీ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు..డేటా సెంటర్ల వల్ల విశాఖలో తాగునీటి సమస్య వస్తుందంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని అన్నారు. డేటా సెంటర్ ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాకముందే నీటి సమస్య వచ్చిందని ప్రచారం చేయడం సరికాదన్నారు. తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయని మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో స్పష్టం చేశారని తెలిపారు. ఎంవీవీ సిటీలో నీటి సమస్యకు బల్క్ వాటర్ చెల్లింపుల విషయంలో బిల్డర్ వైపు ఉన్న బకాయిలే కారణమని తమ దృష్టికి వచ్చిందన్నారు. కనీస సౌకర్యాలు కల్పించకుండా విక్రయాలు జరిపినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నేతలు తమ పరిస్థితిని సమీక్షించుకోవాలని వంశీకృష్ణ సూచించారు. తప్పుడు ప్రచారాలకు బదులు వాస్తవాలను తెలుసుకుని ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా మాట్లాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.



## 29వ వార్డులో ఘనంగా కుంకుమ పూజ

విశాఖపట్నం: అరుణ ప్రభ 29వ వార్డు రామజోగిపేటలో వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా జూనియర్ గల్లీ క్రికెట్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమ పూజా కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు 29వ వార్డు జనసేన అధ్యక్షులు అంగటి శ్రావణ్ కుమార్, తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షులు ఉరికిటి గణేష్ పూజా కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రథమ పూజ్యుడైన వినాయకుడి అనుగ్రహంతో ప్రజలకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. కుంకుమ పూజలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనడం అభినందనీయమన్నారు. పోలీసుల సూచనలు, నిబంధనలను పాటిస్తూ పూజా కార్యక్రమాలు, నిమజ్జన ఊరేగింపు వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.కార్యక్రమంలో కూటమి నాయకులు ఒమ్మి వెంకట అప్పారావు, పల్లా లక్ష్మి,ఒమ్మి సాయి, మురళీకృష్ణ, లక్ష్మణ్, వంశీ, విక్రమ్, లోహిత్, రోహిత్, ఉమా తదితరులు, మహిళలు పాల్గొన్నారు.



## డిండిలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

అరుణప్రభ/ డిండి సెప్టెంబర్ 17 : దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని డిండి మండల కేంద్రంలో గురువారం ప్రజాపాలన దినోత్సవం పురస్కరించుకొని, జాతీయ పతావిష్కరణ గావించారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసిల్దార్ శ్రీనివాస్ గౌడ్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో నర్రా వేజన, పోలీస్ స్టేషన్ లో ఎస్సై బాలకృష్ణ, ఐటిఐ లో ప్రిన్సిపాల్, లక్ష్మణాచారి ,ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గోపాల్ రెడ్డి ,జడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయురాలు గీతాంజలి రెడ్డి, ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం రామారావు, మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి.ఆర్ పి ఆర్ పి స్కూల్ లో ప్రిన్సిపాల్ శిరీష, రైతు వేదిక వద్ద మండల వ్యవసాయాధికారి రెహానా, కస్తూరిబా పాఠశాలలో ఎస్ ఓ లక్ష్మీ, కామేపల్లి జడ్పీ హైస్కూల్లో హెచ్ఎం నరసింహ, చెరుకుపల్లి జడ్పీ హైస్కూల్లో హెచ్ఎం గోపియా నాయక్,, సహకార బ్యాంకు వద్ద మేనేజర్, గ్రామపంచాయతీ వద్ద సర్పంచి రవి , బీసీ బాలికల హాస్టల్ వద్ద మ్యాట్రిన్ రేణుక ఇంకా పలుచోట్ల ప్రభుత్వాధికారులు ప్రజాప్రతినిధులు జాతీయ పతావిష్కరణ చేశారు.

# రైల్లో మత్తుమందు కలిపిన ప్రసాదం.. మంగళసూత్రం చోరీ



ధర్మవరం, సెప్టెంబరు 17; (అరుణ ప్రభ న్యూస్) : రైల్లో మత్తుమందు కలిపిన ప్రసాదం తినిపించి మహిళకు స్పృహ తప్పించి సుమారు 50 గ్రాముల బంగారు మంగళసూత్రాన్ని చోరీ చేసిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మవరం ఆర్పీఎఫ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. మంత్రాలయానికి చెందిన నౌకాదళ ఉద్యోగి గోవిందు తన భార్య సంధ్యతో కలిసి షిర్డీ వెళ్లి, సెప్టెంబరు 15న కోపర్గావ్ నుంచి కర్ణాటక ఎక్స్‌ప్రెస్ (12628)లో తిరుగు ప్రయాణమయ్యారు. మహిళల బోగీలో ఓ మహిళా ప్రయాణికురాలు ఇచ్చిన ప్రసాదం తిన్న అనంతరం దంపతులు నిద్రలోకి జారుకున్నారు. కొద్దిసేపటి తర్వాత గోవిందు మేల్కొని చూడగా భార్య అపస్మారక స్థితిలో ఉండటంతో ధర్మవరం రైల్వే స్టేషన్‌లో దిగారు.



ఆమెను ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు సోలాపూర్ ప్రాంతంలో గతంలో చోరీలకు పాల్పడిన మహిళల ఫొటోలను సేకరించి చూపించగా, ఓ మహిళను బాధితురాలు గుర్తించినట్లు సీఐ తెలిపారు. నిందితురాలిని త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు.



## కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా. సుందరేశ్వరరావు

ధర్మవరం, సెప్టెంబరు 17; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డా. కే. సుందరేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు ఆయన పదోన్నతిపై ఈ బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా విధులు నిర్వహించారు. కళాశాలలో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేస్తానని నూతన ప్రిన్సిపాల్ తెలిపారు. ఆయన నియామకం పట్ల కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



## మద్యం దుకాణాల రెన్యువల్‌కు 21 వరకు గడువు

ధర్మవరం, సెప్టెంబరు 17; (అరుణ ప్రభ న్యూస్) : మద్యం దుకాణాల లైసెన్సుల రెన్యువల్‌కు సెప్టెంబరు 21 వరకు గడువు ఉందని అనంతపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ హర్ష తెలిపారు. అనంతపురం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్.కె.డి.వి. ప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో మద్యం దుకాణాల లైసెన్సుదారులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న లైసెన్స్ ఫీజుపై ప్రభుత్వం 38 శాతం పెంపుతో రెన్యువల్ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. గడువులోగా లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. సెప్టెంబరు 21లోగా రెన్యువల్ చేసుకోని దుకాణాలకు సెప్టెంబరు 22 నుంచి నోటిఫికేషన్ ద్వారా టెండర్లు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఎన్. చంద్రమణి తదితరులు పాల్గొన్నారు.

# డయల్-112 కాల్స్‌పై తక్షణమే స్పందించాలి

### 23న గణేష్ శోభాయాత్రకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు
### నిమజ్జనం నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా చర్యలు.
### జిల్లా ఎస్ పి మహేష్ బి గీతే.



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ప్రతినిధి : డయల్–112కు వచ్చే అత్యవసర కాల్స్‌పై పోలీసులు తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు చట్టపరిధిలో సహాయం అందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఎస్పీ సమీక్షించారు. ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువయ్యేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. నేరాల నియంత్రణలో భాగంగా పట్టణ ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, బ్లూకోల్ట్, పెట్రోకార్ సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, పాత నేరస్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు.

**గణేష్ శోభాయాత్రకు పటిష్ట భద్రత.**

ఈనెల 23న నిర్వహించనున్న గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులతో ముందుగానే సమన్వయం చేసుకుని శోభాయాత్ర రూట్‌మ్యాప్, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన ఏర్పాట్లపై అవగాహన కల్పించాలని సూచించారు. నిర్దేశిత సమయానికి నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యేలా నిర్వాహకులకు ముందస్తుగా సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా సోషల్ మీడియాపై నిఘాను మరింత కఠినతరం చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా నిబంధనలకు విరుద్ధంగా పోస్టులు చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిమజ్జనం సందర్భంగా డీజేలకు అనుమతి లేదని, నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు వీర ప్రసాద్, శ్రీనివాస్, ఎస్ఐలు ప్రేమానందం, శ్రీనివాస్, రాహుల్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# జగదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజాపాలన దినోత్సవం

### పతాకావిష్కరణ.. స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ
### పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

జగదేవపూర్, సెప్టెంబర్ 17: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జగదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీమతి చాందికుమారి పతాకావిష్కరణ చేశారు. అనంతరం ప్రజాపాలన దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రిన్సిపాల్ సూచించారు. పరిశుభ్రమైన సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములై, స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజాపాలన దినోత్సవం, స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు.



## కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులకు అభినందనలు

ధర్మవరం, సెప్టెంబరు 17; (అరుణ ప్రభ న్యూస్) : మల్టీ స్టార్ బుడోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష నిర్వహించారు. కరాటే మాస్టర్ ఎస్. ఇనాయత్ భాషా ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎన్డీఏ కార్యాలయంలో ప్రశంసా పత్రాలు, బ్లాక్ బెల్ట్‌లను అందజేసి అభినందించారు. హెచ్. సుజిత, అలీ, గౌతమ్, రుద్ర, హరిణిలను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల పీడీ స్వరూప, సంద జగన్నాథం మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, కరాటే ఆత్మవిశ్వాసంతో పాటు ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని తెలిపారు. క్రీడా ధ్రువపత్రాలు ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా కింద ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ జి. నవ్యశ్రీ, ఏ. ఉదయ్, కొండ అర్చన, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు బ్లాక్ బెల్ట్ సాధించడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేసినట్లు కోచ్ ఇనాయత్ భాషా తెలిపారు.



## అన్న క్యాంటీన్‌లో ఆహార నాణ్యత పరిశీలన

ధర్మవరం, సెప్టెంబరు 17; (అరుణ ప్రభ న్యూస్) : పట్టణంలోని సిద్ధయ్యగుట్ట, ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని అన్న క్యాంటీన్లను మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో అందిస్తున్న టిఫిన్‌ను రుచి చూసి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆకలితో వచ్చే పేదలకు కేవలం రూ.5కే టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించాలని సూచించారు. అన్న క్యాంటీన్లు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు.





## ధర్మవరం మండలంలో 99 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు

ధర్మవరం, సెప్టెంబరు 17; (అరుణ ప్రభ న్యూస్) : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ధర్మవరం మండలంలోని 99 ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)లను ఏర్పాటు చేయనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు బి. గోపాల్ నాయక్, సి. రాజేశ్వరి తెలిపారు. సెప్టెంబరు 15న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. సెప్టెంబరు 18న ప్రతి పాఠశాల నోటీసు బోర్డులో తల్లిదండ్రులతో కూడిన ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. సెప్టెంబరు 25న ఓటర్ల జాబితాను తుది రూపంలో ప్రకటిస్తారు. సెప్టెంబరు 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక, 2 గంటలకు ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు నూతన ఎస్ఎంసీతో సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవం వేడుకలు

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాదెపాక కిరణ్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ విమోచన కోసం పోరాడిన సమరయోధుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.దేశ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు–కార్యక్రమంలో జిపి కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి కత్తుల నరేష్.సలేంద్ర కళ్యాణి సందీప్. సలేంద్ర రమ సోమన్న.కమ్మగాని సుధాకర్.కమ్మగాని శ్రీకాంత్.నెమరుగోమ్ముల శ్రీనివాస్ .కత్తి దస్తగిరి పబ్బ సంతోష్. అంగన్వాడి ఆశా వర్కర్లు జి పి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# హామీలు అమలు చేయాల్సిందే!

**ఉద్యమకారుల రిలే దీక్షలు షురూ**

**కాలయాపన చేస్తే అసెంబ్లీలో నిలదీస్తాం: శ్రీనివాస్ గౌడ్**

**ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు పోరాటం: జేపీసీ**

**ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి**

**అల్వాల్‌లో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం**





అల్వాల్, సెప్టెంబర్ 17: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యమించిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అల్వాల్ దీక్షా శిబిరం వద్ద గురువారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటుతూ ఉద్యమకారులు, జేపీసీ నాయకులు పెద్ద సంఖ్యలో దీక్షల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి, మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి హాజరై ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ.. నాడు తెలంగాణ కోసం ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నప్పటికీ, తెలంగాణ ఉద్యమకారులకు నేటికీ తగిన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో ఆస్తులు, ఉపాధి కోల్పోయి అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయని పేర్కొన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఉద్యమకారుల ఆకలి బాధలు, వారి కుటుంబాల కష్టాలను ప్రభుత్వం గుర్తించి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. హామీల అమలులో కాలయాపన చేస్తూ ఉద్యమకారులను నిరాశకు గురిచేయడం సరికాదన్నారు. ప్రభుత్వం వద్ద వందల ఎకరాల స్థలం ఉన్నప్పటికీ పొంతనలేని కారణాలతో హామీలను వాయిదా వేస్తే మరోసారి ఉద్యమం ఉధృతమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి హామీలను అమలు చేయాలని, లేకపోతే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిలదీస్తామని తెలిపారు.

జేపీసీ నాయకుడు పటోళ్ల సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడిన సమయంలో అల్వాల్ ప్రజలు ఉద్యమ సత్తాను కళ్లకు కట్టినట్లు చాటారని గుర్తుచేశారు. తెలంగాణ సాధనలో ఉద్యమకారుల త్యాగాలను విస్మరించడం తగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల్లో ఒకటి చెబుతూ, చేతల్లో మరొకటి చేస్తోందని విమర్శించారు. ఉద్యమంలో కేసులు నమోదైన వారినే ఉద్యమకారులుగా పరిగణిస్తామన్న ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. పోలీసు శాఖ వద్ద ఉన్న అప్పటి సమాచారాన్ని సేకరించి, కేసులు లేకపోయినా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న వారిని గుర్తించాలని కోరారు. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి ఉద్యమకారుడికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని స్పష్టం చేశారు. తెలంగాణ కోసం పోరాడిన వారిని గుర్తించే వరకు.. హామీలు అమలు చేసే వరకు పోరాటం ఆగదు అంటూ ఉద్యమకారులు నినదించారు. హక్కుల సాధన కోసం ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు దశలవారీగా కొనసాగుతాయని జేపీసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్నాల కృష్ణ, డోలి సుధీర్, అనిల్, సంతోష్, రషీద్, వీరస్వామి, మల్లేష్, నిర్మల్ జేపీసీ చైర్మన్ సామ కిరణ్ కుమార్ రెడ్డి, పరమేశ్వర్, దొమ్మాటి కిరణ్, కీర్తి శ్రీనివాస్, ముత్యాలు, నర్సింహా, రామయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారి టేబుల్‌పై కుక్కపిల్లలను వదిలి.. నాసిక్‌లో వినూత్న నిరసన!

**నాసిక్‌లో వీధికుక్కల సమస్యపై వినూత్న రీతిలో నిరసన**

**అధికారి టేబుల్‌పై కుక్కపిల్లలను పెట్టిన శివసేన (యూబీటీ) నేత**

**ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని కార్యకర్తల ఆగ్రహం**

**వారం రోజుల్లో సమస్య తీర్చకపోతే ఆఫీసులో కుక్కల్ని వదులుతానని హెచ్చరిక**

**ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్**



మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో చోటుచేసుకున్న ఒక వినూత్న నిరసన ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. వీధికుక్కల సమస్య పట్ల అధికారులు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ, ఓ రాజకీయ నాయకుడు ఏకంగా మున్సిపల్ అధికారి టేబుల్‌పై కుక్కపిల్లలను వదిలారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. నిఫాడ్ నగర పంచాయతీ పరిధిలో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉందని, గత ఆరు నెలలుగా విన్నవిస్తున్నా అధికారులు స్పందించడం లేదని శివసేన (యూబీటీ) యువసేన జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రంధవే ఆరోపించారు. ఇటీవల ఓ బాలుడితో సహా పలువురిపై కుక్కలు దాడి చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ క్రమంలో, తన అనుచరులతో కలిసి నగర పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న ఆయన, చీఫ్ ఆఫీసర్ ధీరజ్ భామ్రేతో చర్చలు జరిపారు. చర్చ జరుగుతుండగానే, రంధవే తన వెంట తెచ్చిన బ్యాగుల నుంచి కుక్కపిల్లలను తీసి ఒక్కొక్కటిగా అధికారి టేబుల్‌పై పెట్టారు. ఈ హఠాత్పరిణామానికి అవాక్కైన ధీరజ్ భామ్రే, ఒక్కసారిగా తన కుర్చీ నుండి వెనక్కి జరిగి పక్కకు తప్పుకున్నారు. అనంతరం, ప్రజా సమస్యల కంటే టెండర్లకే అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపిస్తూ అధికారి మెడలో నోట్ల దండ వేయడానికి కార్యకర్తలు ప్రయత్నించగా, మున్సిపల్ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఈ ఘటనతో కార్యాలయంలో కాసేపు తీవ్ర ఉద్రిక్తత, వాగ్వాదం చోటుచేసుకున్నాయి. వారం రోజుల్లోగా వీధికుక్కల సమస్యను పరిష్కరించని పక్షంలో, కార్యాలయంలో మరిన్ని కుక్కలను వదిలిపెడతానని విక్రమ్ రంధవే హెచ్చరించారు. ఇది అధికారులకు తమ చివరి హెచ్చరిక అని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## లాడ్జిలో ఐడీ కార్డు ట్యాగ్‌తో భార్యను చంపిన భర్త



బెంగళూరు సమీపంలోని దొడ్డబళ్లాపురలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ లాడ్జిలో భర్తే తన భార్యను అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. ఐడెంటిటీ కార్డ్ ట్యాగ్‌తో గొంతు నులిమి ప్రాణాలు తీసి, అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గౌరిబిదనూరు తాలూకా నాగేరెగెరె గ్రామానికి చెందిన విద్యా (23) మృతురాలిగా గుర్తించారు. ఆమె భర్త ఆనంద్ ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న ఈ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. వీరు దొడ్డబళ్లాపురంలోని గాంధీనగర్‌లో ఒక అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. గత ఆరు నెలలుగా వీరిద్దరి మధ్య తరుచూ కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. మనస్పర్థల కారణంగా విద్యా రెండు నెలల క్రితం భర్త నుంచి విడిపోయి బెంగళూరులోని ఒక పేయింగ్ గెస్ట్ వసతి గృహంలో నివసిస్తోంది. ఇదిలా ఉండగా, తన భార్య కనిపించడం లేదంటూ ఆనంద్ దొడ్డబళ్లాపురం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సుమారు 20 రోజుల క్రితం పోలీసులు విద్య ఆచూకీ కనుగొని, దంపతులిద్దరికీ కౌన్సెలింగ్ నిర్వహించి తిరిగి ఆనంద్‌తో పంపించారు. అయితే, బుధవారం ఆనంద్ విద్యను దొడ్డబళ్లాపురంలోని ఒక లాడ్జికి తీసుకువచ్చాడు. అక్కడ ఆమెను దారుణంగా హత్య చేసి, ఆమె మొబైల్ ఫోన్‌తో పరారయ్యాడు. ఈ ఘటనపై దొడ్డబళ్లాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రస్తుతం పరారీలో ఉన్న ఆనంద్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితుడిని అరెస్టు చేసిన తర్వాతే హత్యకు గల కచ్చితమైన కారణాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు. ఈ కేసుపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

## వారం రోజుల పోలీసు కస్టడీకి జోసెఫ్ రావణ్.. కోర్టు కీలక ఆదేశాలు



**చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ప్రేరేపించారనే ఆరోపణలు**

**రావణ్ పై యూఏపీఏ కింద కేసు నమోదు**

**రేపు కస్టడీకి తీసుకోనున్న గన్నవరం పోలీసులు**

సోషల్ మీడియా వేదికగా విద్వేషపూరిత వ్యాఖ్యలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ప్రేరేపించారనే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ బచ్చులకూరి జోసెఫ్ రావణ్ కేసులో గన్నవరం న్యాయస్థానం ఈరోజు కీలక ఉత్తర్వులు వెలువరించింది. ఈ కేసు విచారణలో భాగంగా జోసెఫ్‌ను ఏడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు రేపు (సెప్టెంబరు 18) ఉదయం గన్నవరం పోలీసులు అతడిని కస్టడీకి తీసుకోనున్నారు. యువతను రెచ్చగొట్టేలా వీడియోలు రూపొందించడం, ఏలూరులో నిర్వహించిన ఓ సమావేశంలో నక్సలిజం వైపు మళ్లేలా ప్రసంగాలు చేశారనే ఆరోపణలపై ఏపీ పోలీసులు ఆయనపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కుట్ర వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్, మాజీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో ఉన్న సంబంధాలు, దీని వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాల కోణంలో లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం, వారం రోజుల కస్టడీకి అంగీకరించడంతో రాబోయే విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



## ఓల్డ్ అల్వాల్‌లో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

**ఐజీ స్టాచ్యూ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో జెండావిష్కరణ**

**అమరుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధికి కృషి చేయాలి**

అల్వాల్, సెప్టెంబర్ 17: ఓల్డ్ అల్వాల్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద అల్వాల్ సర్కిల్ బీజేపీ కార్యకర్తల ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండావిష్కరణ చేసి, తెలంగాణ విమోచన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, అప్పటి హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణ ప్రాంతం 1948 సెప్టెంబర్ 17న నిజాం పాలన నుంచి విముక్తి పొంది భారత యూనియన్‌లో విలీనమైందని తెలిపారు. సెప్టెంబర్ 17 చారిత్రక ప్రాధాన్యత కలిగిన రోజని, ఈ రోజు స్వాతంత్ర్య విలువను ప్రతి ఒక్కరికీ గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం, సమైక్యత కోసం ప్రాణాలను అర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ డివిజన్ అధ్యక్షుడు కార్తీక్ గౌడ్, సీనియర్ నాయకులు మల్లికార్జున గౌడ్, మాధవ్, శేఖర్, మాణిక్య రెడ్డి, వర్మ, మహిపాల్ రెడ్డి, లక్ష్మణ్ ముదిరాజ్, సంతోష్ గౌడ్, అనిల్, స్రవంతి తో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ముంబై వేడుకల్లో ట్రంప్ కుమార్తె.. అంబానీ ఇంట ప్రత్యేక ఆకర్షణగా టిఫనీ

**ముంబైలో జరిగిన గణేశ్ వేడుకల్లో పాల్గొన్న ట్రంప్ కుమార్తె టిఫానీ**

**పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ నివాసంలో జరిగిన ఉత్సవాలకు హాజరు**

**భారతీయ సంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన టిఫానీ**

**"లవ్ ఇండియా" క్యాప్షన్‌తో సోషల్ మీడియాలో ఫొటోలు షేర్**

**ట్రంప్ రెండో భార్య మార్లా మాపుల్స్ కుమార్తె టిఫానీ**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె టిఫనీ అరియానా ట్రంప్, ముంబైలో నిర్వహించిన గణేశ్ చతుర్థి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ నివాసంలో జరిగిన ఈ ఉత్సవాలకు ఆమె హాజరై సందడి చేశారు. ముఖ్యంగా ఈ వేడుకల్లో టిఫనీ భారతీయ సంప్రదాయ వస్త్రధారణలో మెరిసి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ కార్యక్రమం అనంతరం టిఫనీ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వేడుకలకు సంబంధించిన ఫొటోలను పంచుకున్నారు. ఆ ఫొటోలకు 'లవ్ ఇండియా' అనే క్యాప్షన్‌ను జత చేయడం విశేషం. ప్రస్తుతం ఆమె షేర్ చేసిన ఈ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. టిఫనీ ట్రంప్, డొనాల్డ్ ట్రంప్ రెండో భార్య మార్లా మాపుల్స్ కుమార్తె. గతంలోనూ పలువురు అంతర్జాతీయ ప్రముఖులు అంబానీ కుటుంబం నిర్వహించే వేడుకలకు హాజరైన సంగతి తెలిసిందే. తాజాగా ఆ జాబితాలో టిఫనీ కూడా చేరారు.

## 30 నిమిషాల్లో 28 లడ్డూలు.. పోటీలో అదరగొట్టిన గుజరాత్ వాసి!

**గుజరాత్‌లో జరిగిన లడ్డూల పోటీలో అరుదైన ఫీట్**

**30 నిమిషాల్లో 28 లడ్డూలు తిన్న బల్వంతభాయ్ రఘ్వానీ**

**గ్రామీణ ఒలింపిక్స్‌లో భాగంగా ఈ పోటీ నిర్వహణ**

**వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా నిలిచిన రఘ్వానీ**

**విజేతకు రూ.2,000 నగదు బహుమతి అందజేత**

గుజరాత్‌లో నిర్వహించిన ఒక ఆసక్తికర పోటీలో స్థానిక వ్యక్తి అసాధారణ ప్రతిభను చాటుకున్నాడు. సురేంద్రనగర్‌కు చెందిన బల్వంతభాయ్ రఘ్వానీ కేవలం 30 నిమిషాల వ్యవధిలో ఏకంగా 28 లడ్డూలను ఆరగించి విజేతగా నిలిచాడు. ఈ పోటీలో అతను వరుసగా రెండోసారి విజేతగా నిలవడం విశేషం. ప్రఖ్యాత తర్ణేతర్ జాతరలో భాగంగా నిర్వహించిన గ్రామీణ ఒలింపిక్స్‌లో ఈ లడ్డూలు తినే పోటీని ఏర్పాటు చేశారు. గుజరాత్ క్రీడలు, యువజన, సాంస్కృతిక వ్యవహారాల శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్, జిల్లా శిక్షణా కేంద్రం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ పోటీలో 25 నుంచి 75 ఏళ్ల మధ్య వయసు గల 28 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీ ప్రారంభమైన తొలి 15 నిమిషాల్లోనే పలువురు సుమారు 15 లడ్డూలు తిని పోటీ నుంచి తప్పుకోగా, చివరకు ఐదుగురు మాత్రమే బరిలో నిలిచారు. పోటీ ఉత్కంఠభరితంగా సాగుతున్న కొద్దీ ప్రేక్షకుల ఉత్సాహం మిన్నంటింది. ఒక్కొక్కరు 22, 24, 26 లడ్డూల మైలురాయిని దాటుతుండగా ప్రేక్షకులు కేరింతలతో ప్రోత్సహించారు. అంతిమంగా బల్వంతభాయ్ రఘ్వానీ 28 లడ్డూలు తిని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. విజేతగా నిలిచిన అతనికి రూ. 2,000 నగదు బహుమతిని అందజేశారు. ఈ పోటీ సందర్భంగా ప్రేక్షకుల నుంచి లభించిన మద్దతు పోటీదారులలో మరింత ఆనందాన్ని నింపిందని జిల్లా కలెక్టర్ జి.హెచ్. సోలంకి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం జాలావార్ ప్రాంతపు జానపద సంస్కృతిని ప్రతిబింబిస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# గుండెపోట్లు ఎక్కువగా బాత్రూమ్‌లలోనే ఎందుకు వస్తాయి..?



ఇప్పటి ఆహార పదార్థాలు, ఆహారపు అలవాట్ల కారణంగా అధిక రక్తపోటు, మధుమేహం, హృదయ సంబంధ రోగాలు పెరిగిపోతున్నాయి. హృద్రోగ మరణాల సంఖ్య కూడా పెరిగిపోతున్నది. ఒకప్పుడు వయసు మళ్లిన వారికి మాత్రమే గుండెపోటు వచ్చేది. ఇప్పుడు పాతికేళ్ల యువత కూడా గుండెపోటుతో ప్రాణాలు కోల్పోతున్నారు. అందులోనూ చాలామంది బాత్రూమ్‌లలోనే గుండెపోటుతో కుప్పకూలుతున్నారు. అమెరికా ఏజెన్సీ NCBI లెక్కల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 11 శాతం గుండెపోటు మరణాలు బాత్రూమ్‌లలోనే చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో బాత్రూమ్‌లలోనే గుండెపోటు మరణాలు సంభవిస్తుండటానికి గల కారణాలను నిపుణులు వెల్లడించారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. స్నానం చేసేటప్పుడు చాలామంది ముందుగా తలని తడుపుకుంటారు. దానివల్ల వేడి రక్తంగల శరీరం ఒక్కసారిగా చల్లటి ఉష్ణోగ్రతను బ్యాలెన్స్ చేసుకోలేకపోతుంది. అన్ని వైపుల నుంచి తల భాగం వైపు రక్త ప్రసరణ పెరుగుతుంది. ఆ సమయంలో రక్త నాళాల్లో ఏవైనా అడ్డంకులు ఉంటే గుండెపోటు వస్తుంది. శీతాకాలంలో ఇలాంటి ఘటనలు ఎక్కువగా జరుగుతుంటాయి. అందుకే స్నానం చేసేటప్పుడు



ముందుగా పాదాలను తడుపుకుని ఆ తర్వాత పైవైపునకు వెళ్లడం శ్రేయస్కరం. ముఖ్యంగా అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, మైగ్రేన్‌తో బాధపడుతున్నవారు ఈ విధానాన్ని పాటించాలి. బాత్రూమ్‌లో గుండెపోటు మరణాలు అధికంగా సంభవించడానికి మరో కారణం మలబద్ధకం. మలబద్ధకం సమస్యతో బాధపడుతున్నవారు విసర్జన సమయంలో బాత్రూమ్‌లో ముక్కుతుంటారు. ఇలా ముక్కినప్పుడు రక్తనాళాల్లోని రక్తం ఎక్కువ పీడనంతో గుండెవైపునకు ఎగిసి వస్తుంది. దాంతో గుండెపోటు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సమస్య రావద్దంటే మలబద్ధకం ఉన్నవాళ్లు వైద్యులను సంప్రదించి సంబంధిత మెడికేషన్ తీసుకోవాలి. ఈ విధంగా గుండె సంబంధ రోగులు, షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు, మలబద్ధకం సమస్య ఉన్నవారు బాత్రూమ్‌లకు వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఉదయాన్నే పళ్లు తోమకుండా నీళ్లు తాగితే



సాధారణంగా చాలామందికి ఉదయం లేవగానే నీళ్లు తాగడం అలవాటు. కొంత మంది బ్రష్ చేసి నీళ్లు తాగితే మరికొందరు మాత్రం బ్రష్ చేయకుండా పరగడుపున నీళ్లు తాగుతారు. అయితే ఇలా బ్రష్ చేయకుండా నీళ్లు తాగడం మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలా తాగితే అనారోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. ఆ అనారోగ్య సమస్యలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.. రాత్రికి పడుకుని ఉదయం లేవగానే నోటి నిండా క్రిములు, బ్యాక్టీరియా ఉంటాయి. పళ్లపై, నాలుకపై అవి పేరుకుపోతాయి. కాబట్టి లేవగానే నోరు శుభ్రం చేసుకోకుండా నీళ్లు తాగితే.. నీళ్లతోపాటు క్రిములు కూడా శరీరంలోకి ప్రవేశిస్తాయి. దీనివల్ల అనేక వ్యాధులు వస్తాయి. పళ్లు కూడా దెబ్బతింటాయి. అయితే పల్లు తోముకుని పరగడుపున నీటిని తాగవచ్చని నిపుణులు చెబుతున్నారు. పరగడుపున ఒక గ్లాస్ లేదా రెండు గ్లాసుల నీళ్లు తాగడంవల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుందని, దానివల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని నిపుణులు చెబుతున్నారు. ఉదయం లేవగానే బ్రష్ చేయకుండా నీళ్లు తాగడంవల్ల శరీరం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంలో ఉన్న టాక్సిన్స్, మలిన పదార్థాలు బయటకు పోతాయి. మల బద్ధకం, జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తలెత్తవు. శరీరంలో కూడా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఖాళీ కడుపుతో నీళ్లు తాగితే చర్మ సమస్యలు పోయి ఆరోగ్యంగా ఉంటుంది. చర్మానికి సహజంగానే మెరుపు వస్తుంది. గోరు వెచ్చని నీళ్లు తాగితే జీర్ణాశయం శుభ్రమవుతుందని అంటున్నారు.



# రోజూ వ్యాయామం చేస్తే

చాలా మంది మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం, థైరాయిడ్, రక్తంలో కొలెస్టరాల్ లాంటి జీవనశైలి వ్యాధులతో సతమతమవుతున్నారు. ఈ దీర్ఘకాలిక వ్యాధులతో అప్పటికప్పుడు వచ్చే సమస్య ఏమీ లేకపోయినా దీర్ఘకాలికంగా చూసుకుంటే మాత్రం ఆయుఃప్రమాణం తగ్గుతుంది. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నవారితో పోల్చితే ఈ వ్యాధులు ఉన్నవారి ఆయుష్షు తక్కువని చెప్పవచ్చు. అయితే వ్యాధులతో సంబంధం లేకుండా ఎవరైనా నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆయుఃప్రమాణాన్ని పెంచుకోవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. జీవనశైలి వ్యాధులతో బాధపడేవారితోపాటు ఆరోగ్యంగా ఉన్న వారి ఆయుఃప్రమాణం పెరగడానికి వ్యాయామం బాగా పనిచేస్తుందని హెల్త్ ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. మనిషి జీవిత కాలం పెరగాలంటే ప్రతిరోజు సగటున 7 వేల అడుగులు నడవాల్సిందేనని సూచిస్తున్నారు. లేదంటే వారంలో కనీసం రెండున్నర గంటలు శారీరక శ్రమ చేయాల్సిందేనని అంటున్నారు. ఇటీవల జరిగిన అధ్యయనాల ఫలితాల ఆధారంగా నిపుణులు ఈ సూచనలు చేస్తున్నారు.

**పది వేల మందిపై అధ్యయనం**

పట్టణ ప్రాంతాల్లో నివసించే వారు టెన్నిస్, సైక్లింగ్, స్విమ్మింగ్, జాగింగ్ లేదా బ్యాడ్మింటన్ లాంటి క్రీడలపట్ల దృష్టిపెడితే శరీరాలకు మంచి వ్యాయామం అవుతుందని ఇటీవల రెండు వేర్వేరు అధ్యయనాల్లో తేలింది. ఈ రెండు అధ్యయనాలు కూడా శారీరక శ్రమతోనే మనిషి జీవితకాలం పెరుగుతుందని స్పష్టంచేశాయి. దశాబ్దకాలంగా దాదాపు 10 వేల మంది స్త్రీలు, పురుషుల అభిప్రాయాలను సేకరించి, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, వచ్చిన ఫలితాల ఆధారంగా నివేదికను రూపొందించారు. శరీరాలకు కావాల్సినంత వ్యాయామం లేకపోవడంవల్ల గుండెపోటు, పక్షవాతం లాంటివి సంభవించి అకాల మరణాలు సంభవిస్తున్నాయి. ఈ క్రమంలో నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఈ అకాల మరణాలను 70 శాతం వరకు తగ్గించవచ్చని నూతన అధ్యయనాల్లో తేలింది. సాధారణ వ్యాయామంతోపాటు యోగాసనాలు వేసేవాళ్లు శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉంటారని ఈ అధ్యయనాలు సూచించాయి. వ్యాయామాలవల్ల ఆయుర్దాయం పెరుగడమేగాక వ్యాధినిరోధక శక్తి కూడా పెరుగుతుందని అధ్యయనాల్లో తేలింది.

**శారీరక శ్రమే రక్ష**

నిత్యం వ్యాయామాలు చేసేవాళ్లతో పోల్చితే.. అస్సలు వ్యాయామం చేయనివాళ్లు, అరుదుగా వ్యాయామం చేసేవాళ్లలో వ్యాధినిరోధక శక్తి తగ్గినట్లు పరిశోధనలు స్పష్టంచేశాయి. 2018లో అమెరికాలో జరిగిన అధ్యయనం ప్రకారం.. అమెరికన్లలో 40 నుంచి 70 ఏండ్ల మధ్య వయసువారి మరణాలు ఎక్కువగా నమోదయ్యాయి. వారిలో 10 శాతం మంది మరణాలకు చాలా తక్కువ సమయం వ్యాయామం చేయడమే కారణమని తేలింది. కాబట్టి నిత్యం వ్యాయామం చేయడం అన్ని విధాలా మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

# కడుపుబ్బరం కలవరపెడుతోందా..



## ఈ చిన్న టిప్స్‌తో చక్కటి పరిష్కారం..!

ఉరుకులు పరుగుల జీవితంలో సమయానికి భోజనం చేయకపోవడం.. ఫాస్ట్‌ఫుడ్స్, బిర్యానీలు లాంటి మసాలా ఫుడ్స్ తరచూ తీసుకోవడం.. లాంటి కారణాలవల్ల అజీర్తి, గ్యాస్ ట్రబుల్, కడుపుబ్బరం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ సమస్యలతో ప్రాణాపాయం లేకున్నా తీవ్రంగా ఇబ్బంది పెడుతాయి. ఎంత ఇబ్బందిగా ఉంటుందో అనుభవించే వాళ్లకే తెలుస్తుంది. అయితే ఈ గ్యాస్ సమస్యను ఎలాంటి మందులు వాడకుండా వంటింట్లో ఉండే ఒక పదార్థంతో ఈజీగా తగ్గించుకోవచ్చు. మరి ఆ వంటింటి పదార్థం ఏదో.. దాంతో కలిగే ప్రయోజనాలేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.. వంటింట్లో ఉండే పదార్థాల్లో ఒకటైన వాము జీర్ణ సమస్యలను తగ్గించడంలో బాగా పనిచేస్తుంది. వాములో ఫైబర్, మినరల్స్, విటమిన్‌లు, యాంటీ ఆక్సిడెంట్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరిచే గ్యాస్ట్రిక్ జ్యూస్‌ల స్రావానికి తోడ్పడుతాయి. అజీర్ణం కారణంగా వచ్చే అన్ని సమస్యలకు వాము చక్కటి పరిష్కారం చూపుతుంది. ఎసిడిటీ నుంచి తక్షణ ఉపశమనాన్ని అందిస్తుంది. అర స్పూన్ వాములో చిటికెడు ఉప్పు కలిపి నమిలి మింగాలి. ఆ తర్వాత ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లు తాగాలి. లేదంటే పొయ్యి మీద గిన్నె పెట్టి దానిలో ఒక గ్లాసు నీళ్లు పోసి అర స్పూన్ వాము వేసి మరిగించాలి. ఇలా మరిగించిన ఈ నీటిని ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి గోరువెచ్చగా తాగాలి. ఇలా చేయడంవల్ల పొట్టలో ఉన్న గ్యాస్ మొత్తం బయటకు వెళ్లి పొట్ట క్లీన్ చేస్తుంది. అదేవిధంగా వాములో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ సి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. దాంతో సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు, గొంతు నొప్పి లాంటివి రాకుండా ఉంటాయి. శరీరంలో రక్త సరఫరా బాగా సాగి రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అంతేగాక వాము కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచి గుండె ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. కాబట్టి తరచూ వామును ఏదో ఒక రూపంలో తీసుకునే ప్రయత్నం చేయాలి.

CORPORATE OFFICE: SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267, HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070. TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY, # H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printed at: GARUDA PRINT-ERS, # H.No.2-86/1, Plot No.23-SP, SyNo.417, Sagar Highway, Rangannaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510. Telangana. Published at: # H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District. 501511. Telangana....www.arunaprabha.com.email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889.